RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.


9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 212 శుక్రవారం 28 - 02 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## తెలంగాణ, హైదరాబాద్

# రైజింగ్ ఆగదు

- హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ కొత్త
- క్యాంపస్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రతి రోజూ బహుళజాతి సంస్థలతో
- కొత్త అవగాహన ఒప్పందాలు
- దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతు
- తెలంగాణ రాష్ట్రం,హైదరాబాద్ నగరం
- "గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్
- భారతదేశానికి గర్వకారణం
- రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు,
- రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు




హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాము ప్రతి రోజూ బహుళజాతి సంస్థలతో కొత్త అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడమో, పెద్ద సంస్థలు తెలంగాణకు రావడమో, గత సంవత్సరం సంతకం చేసిన ఎంఓయూల కొత్త సౌకర్యాలను ప్రారంభించడమో జరుగుతోందని అన్నారు. హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కేవలం ఏడాది కాలంలోనే రాష్ట్రానికి దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని గర్వంగా చెబుతున్నావ ఎన్నారు. ఉద్యోగ కల్పనలో నెంబర్ వన్?గా నిలిచామన్నారు. తమ దగ్గర అత్యధిక ఏఐ, అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్నాయని చెప్పారు. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తామని ముందు చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరు అన్నారని పేర్కొన్నారు.

రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తర్వాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారని సీఎం రేవంత్ వివరించారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరన్నారు. తమ పోటీ ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని తాను చెప్పినప్పుడు కొంత మంది అది పెద్ద కలనే అవుతుందని ఎద్దేవా చేశారన్నారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక, రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, స్కిల్స్, మ్యాను ఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్‌కు హబ్‌గా మారుస్తామని స్పష్టం చేశారు.

**హైదరాబాద్ రైజింగ్ ఆగదు :** ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదని ప్రజలు అనుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తాను మొదట తెలంగాణ రైజింగ్, హైదరాబాద్ రైజింగ్ అని చెప్పినప్పుడు - మిగతా 2 లో

## టీవీల ముందు కూర్చోవడం కాదు

# టన్నెల్‌లో ఉన్నవారిని కాపాడండి



- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై నిలదీత
- టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల సహాయక చర్యలపై ఆరా తీసి, సలహాలు, సూచనలు ఇస్తాం
- 15 నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని విమర్శలు
- హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, టీవీల ముందు ఉపన్యాసాలు మాని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను తక్షణమే కాపాడాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. సీఎం దిల్లీ పర్యటనలోనూ, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలోనూ బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై విమర్శలు, ఆరోపణలు చేయడం సబబు కాదని హరీశ్‌రావు మండిపడ్డారు. హైదరాబాద్ కోకాపేటలోని ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు.టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది జాడ కనుక్కోవడంలో, సహాయక

- మిగతా 2 లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న

# సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



- రాష్ట్రంలో ప్రశాంతంగా సాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో పోలింగ్
- ఉండవల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
- కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 2 స్థానాల్లో పోలింగ్
- రాష్ట్రంలోని 3 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

రాష్ట్రంలోని 3 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగుతోంది. కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 2 పట్టభద్రుల స్థానాలతో పాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికారులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఏర్పాట్లు, ప్రక్రియను పరిశీలిస్తున్నారు.

**ఓటేసిన చంద్రబాబు, లోకేశ్ :** ఉమ్మడి కృష్ణా - గుంటూరు - మిగతా 2 లో

# ఎన్నికల కమిషన్ ముందు దీక్ష చేస్తా




- దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈసీని డిమాండ్
- ఎన్నిక ఫలితాలను మార్చేందుకు గుజరాత్, హర్యానా ఓటర్లను
- తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోంది
- ఓటర్ల జాబితాను వెంటనే సరిచేసి, ఫేక్ ఓటర్లను తొలగించా
- ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావు...
- బయటి వ్యక్తులు పశ్చిమ బెంగాల్‌ను స్వాధీనం చేసుకోలేరు
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

# రష్యా-అమెరికా దౌత్యవేత్తల చర్చలు




- అమెరికా, రష్యాలు శాంతి చర్చల
- దిశగా వేగంగా అడుగులు
- వేదికగా అమెరికా రాయబారా కార్యలయం
- ఇరు దేశాల్లో పనిచేసే వాతావరణంపై చర్చ

# రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి ఛాలెంజ్




- ఆరోపణలను నిరూపించండి
- తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందన
- రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం
- సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## రేపే ఏపీ బడ్జెట్..

## 'సూపర్ సిక్స్' సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం?

- ఉదయం 11గంటలకు మంత్రి పయ్యావుల..
- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్
- 'సూపర్ సిక్స్' సంక్షేమ పథకాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం




2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3.20 లక్షల కోట్ల అంచనాలతో ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.శుక్రవారం ఉదయం 11గంటలకు మంత్రి పయ్యావుల.. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో 'సూపర్ సిక్స్' సంక్షేమ పథకాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైకాపా హయాంలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించే మార్గాలతో పాటు మూలధన వ్యయం పెంచే విధంగా బడ్జెట్‌ను రూపొందించినట్లు సమాచారం.

# విద్యార్థులకు గుడ్‌న్యూస్


# జర్మనీలో ఉద్యోగాలు



- జర్మనీలో 3 లక్షలమంది
- నర్సింగ్ అభ్యర్థుల కొరత
- ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్,
- స్కిల్ బి నడుమ అవగాహన ఒప్పందం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇరుపక్షాలు ఎంవోయుపై సంతకాలు
- 4 వేలమందికి పైగా నర్సింగ్ విద్యార్థులకు స్కిల్ బి ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి

జర్మనీలో 3 లక్షలమంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. నర్సింగ్ చదివే విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి ఆ దేశంలో ఉపాధి కల్పిస్తాన్నారు. ఈ మేరకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ బి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఎఎన్ఎం విద్యార్థినులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణ ఇప్పించేందుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ బి నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇరుపక్షాలు ఎంవోయుపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "జర్మనీలో వృద్ధుల సంరక్షణ, హాస్పిటల్స్‌లో 3 లక్షలమంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉంది. యూరప్‌లో ముఖ్యంగా జర్మనీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రంలో నర్సింగ్ చేసిన విద్యార్థినులకు స్కిల్ బి ద్వారా జర్మన్ - మిగతా 2 లో

## తెలంగాణ, హైదరాబాద్ రైజింగ్ ఆగదు




కొందరికి కచ్చితంగా తెలియదు, ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోందని ఆనందించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను కొద్దిరోజుల క్రితం ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. తాము ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాలలో ఒకటైన బయో ఆసియాను నిర్వహించామని, ఇవాళ హెచ్‌సీఎల్‌లో ఉన్నామని తెలిపారు."గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 60 దేశాలలో ఆపరేట్ చేస్తోంది. 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్ వచ్చినప్పటి నుంచి అంచెలంచెలుగా %ఎజూ%పెద్ద స్థాయికి ఎదిగింది. ఇవాళ 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 5 వేల మందితో కేఆర్ సీలో ప్రపంచస్థాయి సదుపాయంతో హెచ్‌సీఎల్ టెక్ హైదరాబాద్‌లో గొప్ప పనులు చేస్తుంది."

## ఎన్నికల కమిషన్ ముందు దీక్ష చేస్తా



ఈసీ సాయంతో బీజేపీ ఇతర రాష్ట్రాల నుంచి ఫేక్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు.పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ..ఎలక్షన్ కమిషన్ సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి ఫేక్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని విమర్శించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈసీని డిమాండ్ చేశారు. లేకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానంటూ హెచ్చరించారు.తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతేకాదు భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపై కూడా దీదీ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేస్తోందని విమర్శించారు. 2006లో భూసేకరణకు వ్యతిరేకంగా 26 రోజుల పాటు జరిగిన నిరాహార దీక్షను కూడా గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను వెంటనే సరిచేసి, ఫేక్ ఓటర్లను తొలగించాలంటూ డిమాండ్ చేశారు.ఎన్నిక ఫలితాలను మార్చేందుకు గుజరాత్, హర్యానా ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని ఆరోపణలు చేశారు. ఢిల్లీ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఇలాంటి వ్యూహాలనే అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని బీజేపీకి తెలుసని.. అందుకే తప్పుడు ఓటర్ల జాబితాను రూపొందించే పనిలో పడిందని విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని.. బయటి వ్యక్తులు పశ్చిమ బెంగాల్‌ను స్వాధీనం చేసుకోలేరన్నారు. ఇక రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాము 294 స్థానాలకు గాను 215 చోట్ల గెలుస్తామని దీదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు గుడ్‌న్యూస్ జర్మనీలో ఉద్యోగాలు మంత్రి నారా లోకేశ్



భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుంది.ఈ శిక్షణ వల్ల ఏటా వెయ్యిమంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో అత్యుత్తమ ప్యాకేజితో ఉద్యోగాలు లభిస్తాయని" అన్నారు. మరోవైపు స్కిల్ బి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ఉజ్వల్ చౌహన్ మాట్లాడుతూ " తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 10 వేలమందికిపైగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించాం. స్కిల్ బి అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ స్టార్టప్‌లలో ఒకటిగా ఉంది. జర్మనీ, పోలాండ్, హంగేరీ, లిథువేనియా, లాట్వియా, ఇతర తూర్పు ఐరోపా దేశాలకు తమ సంస్థ ద్వారా అభ్యర్థులను రిక్రూట్ చేస్తున్నాం.ఏపీఎస్ఎస్డీసీ భాగస్వామ్యంతో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం స్పెషలైజేషన్‌తో గ్రాడ్యుయేషన్ పొందిన నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇప్పిస్తాం. ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తాం. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఏపీఎస్ఎస్డీసీలు భాషా నైపుణ్య కొరతను పరిష్కరించి, ఏపిని నైపుణ్య రాజధానిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని 4 వేలమందికి పైగా నర్సింగ్ విద్యార్థులకు స్కిల్ బి ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని" తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్డీసీ సిఈవో గణేష్ కుమార్ తదితరలు పాల్గొన్నారు.



# రష్యా-అమెరికా దౌత్యవేత్తల చర్చలు



అమెరికా, రష్యాలు శాంతి చర్చల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఇరు దేశాలకు చెందిన కీలక దౌత్యవేత్తలు నేడు తుర్కియేలో భేటీ అయ్యారు. ఇందుకు అమెరికా రాయబారా కార్యలయం వేదికగా మారింది. గురువారం రష్యా అధికారుల బృందం అక్కడకు చేరుకొంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపర్చుకొనేందుకు చేస్తున్న యత్నాల్లో భాగంగా.. వాషింగ్టన్ , మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదాలను ఈ సందర్భంగా చర్చించుకొన్నారు. దౌత్య సిబ్బంది ఇరు దేశాల్లో పనిచేసే వాతావరణంపై చర్చించనున్నారు. దీనిలో ఉక్రెయిన్, ఇతర రాజకీయ, భద్రతా పరమైన అంశాలను చేర్చలేదు. ఈ చర్చలపై అమెరికా విదేశాంగశాఖ మాట్లాడుతూ "ఈ చర్చలు చాలా నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. అసలు సమస్యలు పరిష్కారం అవుతాయా..? లేదా అన్నది తేలిపోతోంది. దీంతోపాటు రష్యా మంచి ఉద్దేశంతోనే చర్చలకు వచ్చిందా అనే విషయం కూడా తెలుస్తుంది" అని పేర్కొంది.మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ మాట్లాడుతూ తమ దేశ దౌత్యవేత్తలకు మెరుగైన పరిస్థితులను కల్పించేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో అడుగుపెట్టిన ఐదు వారాల్లోనే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రష్యా అధినేత పుతిన్‌తో ఫిబ్రవరి 12న ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత 18వ తేదీన సౌదీ అరేబియాలో అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలు, మంత్రులు భేటీ అయ్యారు. ఈ పరిణామాలతో కీవ్, ఐరోపా సమాఖ్య మిత్రులు అప్రమత్తమయ్యారు. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ట్రంప్ శరవేగంగా తీసుకొంటున్న చర్యలపై పుతిన్ ఈ వారం స్పందించారు. అమెరికా, రష్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించకపోతే ఏమీ సాధించలేరని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇరుదేశాలు దౌత్యస్థాయిలో సమస్యల పరిష్కారానికి తుర్కియేలో భేటీ అయ్యాయి. ఇక రష్యాతో కూడా ట్రంప్ ఖనిజాల డీల్ చేసుకొంటారన్న వార్తలు వెలువడుతుండటంతో.. ఈ చర్చలకు ప్రాధాన్యం పెరిగింది.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్





జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాతంగా సాగుతోంది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో తెలుగుదేశం అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిలబడ్డారు. ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చంద్రబాబు, లోకేశ్? తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలు – ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్**

అందరినీ ఆప్యాయంగా పలకరించిన సీఎం: ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఓటేసి బయటకొచ్చిన చంద్రబాబు, లోకేశ్‌ని కలిసేందుకు జనం ఇళ్లలోంచి పెద్దఎత్తున బయటకు వచ్చారు. ఆందరినీ ఆప్యాయంగా పలకరించిన సీఎం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు, చిన్నారుల కోరిక మేరకు వారితో ఫోటోలు దిగారు. ఈ క్రమంలో ఓ చిన్నారిని సీఎం ఎత్తుకుని ఫొటో దిగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే గొల్లపూడిలో మాజీమంత్రి దేవినేని ఉమ, నందిగామలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**గోదావరి జిల్లాల్లో ప్రశాంతంగా ఎన్నికలు** : గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. నిడదవోలు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం నుంచే ఓటర్లు పెద్దఎత్తున తరలివస్తున్నారు. అనపర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలానే ఏలూరు జిల్లాలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య నగరంలోని 41వ డివిజన్ గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకోగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జీలుగుమిల్లి జెడ్పీ పాఠశాలలో ఓటు వేశారు.

# టీవీల ముందు కూర్చోవడం కాదు టన్నెల్‌లో ఉన్నవారిని కాపాడండి



చర్యలు ముమ్మరం చేయకపోవడంపై ప్రభుత్వ వైఫల్యం కనబడుతోందని హరీశ్‌రావు ఆరోపణలు చేశారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ పనులను గత ప్రభుత్వం 13 కిలోమీటర్ల మేర చేపట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని ఆయన విమర్శలు చేశారు. ఈ నెల 22న దుర్ఘటన జరిగినా, పార్టీ రాజకీయాలు చేయరాదని భావించి సంయమనం పాటించినట్లు హరీశ్ రావు తెలిపారు.

**సలహాలు, సూచనలు ఇస్తాం :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు తమ పార్టీని విమర్శించడంతోనే దీనిపై స్పందించాల్సి వచ్చిందని హరీశ్ రావు అన్నారు. ప్రెస్‌మీట్ అనంతరం మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల పార్టీ నాయకులతో కలిసి ఎస్ఎల్‌బీసీ ప్రాంతం వద్దకు ఆయన బయలుదేరి వెళ్లారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల సహాయక చర్యలపై ఆరా తీసి, సలహాలు, సూచనలు ఇస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయక చర్యలను వేగవంతం చేసి టన్నెల్‌లో చిక్కుకున్న వారిని తక్షణమే బయటకు తీసుకువచ్చేందుకు చొరవ చూపించాలని కోరారు.

**ఎస్ఎల్‌బీసీ ప్రమాదం :** ఈ నెల 22వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనులు చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 8 మంది సొరంగంలో చిక్కుకున్నారు. సొరంగంలోని 14వ కిలోమీటర్ వద్ద పైకప్పు కూలి ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకున్నారు. వీరిని రక్షించేందుకు ఐదు రోజులుగా ఆపరేషన్ టన్నెల్‌ను నిర్వహించారు. టన్నెల్‌లో బురద, నీటితో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది. సహాయక చర్యల్లో ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, సింగరేణి కాలరీస్, ర్యాట్ మైనర్లు ఇలా చాలా మంది రెస్క్యూ బృందాలు పాల్గొన్నాయి. మంత్రులు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తారు.

# రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి ఛాలెంజ్




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ ఆయన విసిరారు. హైదరాబాద్ నగరంలోని మెట్రో రెండో దశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ బుధవారం వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు.

**రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు :** ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుందని, దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని, కేంద్రం ప్రభుత్వం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా? అని ఆయన నిలదీశారు.

**సీఎం రేవంత్ ఏమన్నారంటే :** మెట్రో రెండో దశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండాకేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకున్నారని, తన మిత్రుడు కేసీఆర్ పది సంవత్సరాల్లో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తనకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదని, కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండని సూచించారు.తాను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తానని, సన్మానం చేసి గండపెండేరం తొడుగుతానని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ఐదు ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధాని నరేంద్రమోదీకి విన్నవించామని అన్నారు. వాటికి నిధులు, అనుమతులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదేనని తెలిపారు. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వారికి తిండి దండగ అంటూ వ్యాఖ్యానించారు.

"ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా నేను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లయితే రేవంత్ రెడ్డి నిరూపించాలి.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శుక్రవారం 28 - 02 - 2025

## అధికారం ఉన్నప్పుడు కవితకు కురవి వీరభద్ర స్వామి గుర్తు రాలేదా

### చిన్నగూడూరు కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జంపాల శోభ



**మహబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన ప్రతినిధి :** నాడు బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అంతకుముందు ఏ నాడు కొరవి వీరభద్రు స్వామిని కవిత దర్శించుకోలేదని, చిన్నగుడురు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు జంపాల శోభ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయం చేయడం కోసమే కవిత వచ్చి కురవి వీరభద్ర స్వామి ని దర్శనం చేసుకుందని గతంలో బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మహిళల్ని, ప్రజల్ని ,రైతుల్ని నిరుద్యోగులను పట్టించుకోని కవిత ఇప్పుడు చిలక పలుకులు పలుకుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళల కోసం రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు.ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళలకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ 500 రూపాయలకే సిలిండర్ ఇస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలని దృఢ సంకల్పంతో మొదటి దశలో 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాట్లు చేశారన్నారు.ఆడబిడ్డల భద్రత కోసం టి- సేఫ్ యాప్ తయారు చేశారని గుర్తు చేశారు.మహిళా సంఘాల ద్వారా మహిళల కోసం మొదటి దశలో 150 ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేశారన్నారు.మహిళా సంఘాల బలోపేతానికి ఇందిరా మహిళా శక్తి ద్వారా సంచార చేపల విక్రయాల కేంద్రాలను ఏర్పాటు చేశారు.రైతుల కోసం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి ఎకరాకి 12,000 రైతు భరోసా ఇచ్చి సన్నాలకి క్వింటాలు 5 రూపాయలు బోనస్ ఇచ్చి భూమిలేని పేద రైతులకు రైతు ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు ప్రజా ప్రభుత్వం ఇస్తుంది. కనీవిని ఎరగని రీతిలో 66.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు.కృష్ణా జలాల్లో 811 టిఎంసిలకి 299 టీఎంసీలకు సంతకం పెట్టింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కెసిఆర్ పరిపాలన నియంత పరిపాలన అని రేవంత్ రెడ్డి గారి పరిపాలన ప్రజా పరిపాలనని జంపాల శోభ మాట్లాడడం జరిగింది.

## ఓటు హక్కు వినియోగించుకున్న బైరం రమేష్




**తెలంగాణ సేన ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న గజ్వేల్ మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ అనంతరావు పల్లి గ్రామ అధ్యక్షుడు, బైరం రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దామన మైన మల్లేశం మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు, ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని,ప్రజా సంక్షేమం పాలన కాంగ్రెస్ కే సాధ్యమని అన్నారు,ఈ కార్యక్రమంలో నాయకులు దార మల్లేష్, బైరం కరుణాకర్,ప్రభాకర్,బాలస్వామి,నరేష్,శ్రీకాంత్,నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల రోడ్డుపైన మిషన్ భగీరథ నీరు

**తెలంగాణ సేన ప్రతినిధి :** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లో పట్టణం గాంధీ చౌక వద్ద మిషన్ భగీరథ లైను లీక్ అవ్వడంతో రోడ్డు పైన నీరు ప్రహనిస్తోంది ఇదే ప్రదేశంలో వారం రోజుల క్రితం మరమ్మత్తులు చేయగా మళ్లీ పైపు పగిలిపోయింది. దీంతో రోడ్డుపైన నీరు ప్రవహీనుస్తుంటాంతో వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అధికారులు స్పందించి త్వరగా మరతమ్మతులు చేపట్టాలని కోరారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి




**మహుబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన ఫిబ్రవరి :** విద్యార్థులు తార్కిక ఆలోచన పెంపొందించుకోవడం ద్వారా పరిశోధన చేయుటకు ప్రేరణ కలుగుతుందని కేంద్రీయ విద్యాలయం మహబూబాబాద్ ఇన్చార్జి ప్రిన్సిపల్ ముఖేష్ కుమార్ విద్యార్థుల ఉద్దేశించి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవపు ముందస్తు వేడుకలలో భాగముగా గురువారం సైన్స్ ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించినారు. ఈ సందర్భంగా సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలను అర్పించినారు. తదనంతరము సర్ సి.వి. రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ప్రభావాన్ని కనుగొన్నందుకుగాను ప్రతి సంవత్సరము భారతదేశంలో ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన చేయడం , తమ సమయాన్ని ప్రయోగశాలలో గడిపేటువంటి అవకాశాన్ని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు విద్యార్థులకు కల్పించినప్పుడే యువ శాస్త్రవేత్తలు తయారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయుడు ఇమాముద్దిన్ , భాస్కర్, రితేష్ తపస్వి , మీర్జా మోసిన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## రామక్క తీర్థంకు సీతమ్మ తల్లి శివ దర్శనం



**కొత్తగూడ, తెలంగాణ సేన ప్రతినిధి :** మండలంలోని గుండంపల్లి గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన గుండం రామక్క గా పేరుగాంచిన గుండం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క...ఆలయ నిర్వాహకులు అర్చకులు కాంగ్రెస్ పార్టీ కొత్తగూడ మండల నాయకులు సీతక్క రాకను డప్పు చప్పులతో మంగళ వాయిద్యాలతో అభిమాన నృత్యాలతో స్వాగతం చెబుతూ గుండం శివాలయంలోకి ఆహ్వానం తెలిపారు.ముందుగా అర్చకులు మంత్రివర్యులు సీతక్క గారికి పూర్ణకుంభంతో స్వాగతం తెలిపారు గుండం శివాలయం లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివలింగం నీకి ప్రధాన అర్చకులు చే ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం సీతక్క మాట్లాడుతూ..కాకతీయుల కళా సంపద భావ్య ప్రపంచానికి తెలియాల్సి ఉందని శివరాత్రి పండుగ సమీపిస్తున్నదని అభివృద్ధి పనుల కొరకు స్థానిక నాయకులు తనను కలిశారని తన సొంత నిధులతో తో 25 లక్షల రూపాయలను గుండం శివాలయానికి ఇచ్చినట్టు ఈ సందర్భంగా అన్నారు రానున్న రోజుల్లో గుండంపల్లి నుంచి నల్లబెల్లి మెయిన్ రోడ్డు వరకు డబల్ రోడ్ చేసుకుందామని గుండం శివాలయాన్ని మరింత అభివృద్ధి చేసుకొని నిత్య పూజలు చేసుకొనుటకు ప్రత్యేక అర్చకుని నియమిస్తామని ఈ సందర్భంగా అన్నారు.

**ఘాట్‌లను సందర్శన**

గుండం శివాలయానికి వచ్చే భక్తులు గుండం చెరువులో స్నానం లు ఆచరించి గుడిలోకి వెళ్తారు గత పాలకులు నిర్లక్ష్యంతో చెరువులో దిగడానికి ఇబ్బందికరంగా ఉండేది . స్థానిక నాయకులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లగా 25 లక్షల రూపాయలను అభివృద్ధి పనులకు మంజూరు చేశారు.. భక్తులు స్నానం లు చేయడం కోసం చెరువు కట్ట నుంచి చెరువులో దిగడానికి ఘాట్లు మెట్లు నిర్మించారు లిసీతక్క లి ఘాట్లను పరిశీలించి భక్తులను పలకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్జ సారయ్య , చల్లా నారాయణరెడ్డి, రూప్సింగ్ , సుంకర బోయిన మొగిలి , లావణ్య వెంకన్న, బిట్ల శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్, ఈర్ప రాజేశ్వర్,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న జుబేర్ పాషా



**తెలంగాణ సేన ప్రతినిధి :** ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న సిద్దిపేట జిల్లా ములుగు మండలం బిఆర్ఎస్ యూత్ వింగ్ నాయకుడు జుబేర్ పాషా మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు, అని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు,యువత సన్మార్గంలో పయనించాలని, సరియిన వారిని ఓటు హక్కు ద్వారానే ఎన్నుకోవచ్చు అని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యం - అంక్ష రెడ్డి



**తెలంగాణ సేన ప్రతినిధి :** ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యమని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఆంక్ష రెడ్డి అన్నారు, గురువారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని పరిశీలించిన ఆంక్ష రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, బిజెపి మాటలకే పరిమితమైన పార్టీ అని, బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయక పోవడం లో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదని, కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలిపిన ఓటర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తాండ కనకయ్య గౌడ్, పాములపర్తి తాజా మాజీ సర్పంచ్ తిరుమల్ రెడ్డి , ర్యాకం యాదగిరి,గోవర్ధన్,తిరుపతి రెడ్డి, గుర్రాల నర్సింలు,సురేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా శివానందలహరి



**తెలంగాణ సేన ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో శివరాత్రి సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో గజ్వేల్ లో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శివానందలహరి, కార్యక్రమం వైభవంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని, శివరాత్రి సందర్భంగా శివానందలహరి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు,ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, భాస్కర్ , లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్,లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్,లయన్ పరమేశ్వర చారి, లయన్ నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, రచయిత, కవి ,గాయకుడు,విశ్వేశ్వర రావు,విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.ద

## తెలంగాణ ఉద్యమ పునాది ప్రొ.బియ్యాల జనార్ధన్ రావు



**తెలంగాణ సేన ప్రతినిధి :** కాకతీయ యూనివర్సిటీ కేంద్రం గా తెలంగాణ ఉద్యమాన్ని నిర్మించి, బావవ్యాప్తికి ప్రతి పల్లె తిరిగి ఉద్యమానికి పునాది గా నిలిచిన ప్రొ. బియ్యాల జనార్దన్ రావు సార్ 23 వ వర్ధంతి ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉద్యమనేతలు డా. డోలి సత్యనారాయణ, పిల్లి సుధాకర్, పార్నంది రామయ్య, బుర్ర గోవర్ధన్, పొక్కుల సదానందం, కృష్ణప్రసాద్ తదితరులు స్థానిక నలంద డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, వారు మాట్లాడుతూ కేసి ఆర్ లాంటి వ్యక్తులను నాడు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేపించి ఉద్యమానికి ఉసురు పోసిన వ్యక్తి, ఆదివాసి ఉద్యమాలు సామాజిక పోరాటాలను తెలంగాణ ఉద్యమం వైపు నడిపించిన మహోన్నత వ్యక్తి బియ్యాల సార్ అని అన్నారు, ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి తగు ప్రాదాన్యత ఇవ్వాలని కోరారు.

## మార్చి 1న మాదిగ అమరుల దినోత్సవం




**హైదరాబాద్ సోమాజిగూడ తెలంగాణ సేన న్యూస్ :** మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా, గ్రామ మండల, జిల్లా, కేంద్రాలలో నిర్వహించాలని మాదిగ అమరవీరుల త్యాగాల గుర్తుగా ఒక స్థూపాన్ని నిర్మించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాదులో ఆయన మీడియాతో మాట్లాడారు.హైదరాబాద్ సమీపంలో 5, ఎకరాలలో స్థలంలో మాదిగ అమరవీరుల గుర్తుగా ఒక మ్యూజియం నిర్మించాలని,మాదిగ అమరవీరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఫిబ్రవరి 11వ తేదీన రాతపూర్వకంగా ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది అని తెలిపారు.షమిము అక్తర్ కమిషన్ నివేదికలో లోపాలను సవరించాలి.ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతలో లోపాలను సవరించి, ఎస్సీలను ఏబిసిడిలుగా గుర్తించాలి అభివృద్ధి చెందని కులాలకు మొదటి ప్రాధాన్య ఇవ్వాలని డిమాండ్ చేశారు.మార్చి 3 నుండి 10 వరకు మండల, నియోజకవర్గం, జిల్లా, కేంద్రాలలో డప్పుల ప్రదర్శన కళాకారులతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలి.మంత్రివర్గ విస్తరణ జరిపి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని చెప్పారు.10తేదీలోపు ఎస్సీలనుగా ABCDలుగా గ్రూపులుగా విభజించకుండా లోపాలను సవరించకుండా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తే 11వ తేదీ, నుంచి ఎమ్మార్పీఎస్, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం.

## ఓటు హక్కును వినియోగించుకున్న జుక్కల్ ఎమ్మెల్యే



**తెలంగాణ సేన ప్రతినిధి :** పోలింగ్ స్టేషన్ నెంబర్ 167 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిట్లం లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఘనంగా మహాశివరాత్రి వేడుకలు...కిక్కిరిసిన శివాలయాలు



**తెలంగాణ సేన ప్రతినిధి :** మహాశివరాత్రి వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు తరలివచ్చి మహాశివుడి దర్శనం చేసుకొని మొక్కులు చెల్లిస్తున్నారు. ఆలయాల్లో స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శివనామ స్మరణతో శివాలయాలు మారుమ్రోగుతున్నాయి. ఆలయాల వద్ద ఇలాంటి ఇబ్బందులు భక్తులు ఎదుర్కోకుండా పెద్ద ఎత్తున ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. వేములవాడ తోపాటు ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు స్వామి వారి దర్శనం కోసం నాలుగు నుండి ఆరుగంటల సమయం పడుతుంది. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. పెద్దపల్లి శివాలయంలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఇల్లందుల కృష్ణమూర్తి, నాళ్ళ విశ్వనాథ్, దక్షిణామూర్తి, అల్లంకి శ్రీనివాస్ తోపాటు పలువురు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర మంత్రి పూర్ణ ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలోని పలు శివాలయాల్లో మహాశివల్లి దర్శించుకున్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ కమిటీ ఎంపీని ఘనంగా సత్కరించారు.

## తీగలపహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

### ఇరువర్గాల మధ్య రాళ్ల దాడులు, తోపులాట


### పోలీసుల జోక్యంతో అదుపులోకి వచ్చిన పరిస్థితి



**తెలంగాణ సేన ప్రతినిధి :** మంచిర్యాల జిల్లా, నస్పూర్ పట్టణంలోని తీగల్పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటలకు ప్రశాంతంగా మొదలైన టీచర్, పట్టభద్రుల ఎన్నికల ప్రక్రియ కాంగ్రెస్, బిజెపి నాయకులు అరంగేట్రంతో ఉద్రిక్తత వాతావరం నెలకొంది. దారికి అడ్డంగా పెట్టిన బండ్లను, ఓటర్లని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులు దూరంగా ఉండాలంటూ పోలీసులు వారించడంతో బిజెపి నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో కాంగ్రెస్ నాయకులు కల్పించుకొని ఇరువర్గాలు బూతుపురాణం అందుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగామారింది. దీంతో కాంగ్రెస్ నాయకులకు పోలీసులు మద్దతు ఇస్తున్నారు అంటూ తమపై పోలీసులు చేయి చేసుకున్నారని బిజెపి నాయకులు వాగ్వివాదానికి దిగుతూ రాస్తారోకో నిర్వహించారు. ఇదే అదును చూసుకొని కొందరు అల్లరి మూకలు రాళ్లు విసరడంతో పరిస్థితి అదుపుతప్పడంతో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, మంచిర్యాల డిసిపి భాస్కర్, ఏసీపీ ప్రకాష్ లు రంగంలోకి దిగి ఇరువర్గాలతో మాట్లాడి, అల్లరి మూకలను చదరగొట్టి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ అల్లర్లకు ఆద్యం పోసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలను ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ తీరును వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**తెలంగాణ సేన ప్రతినిధి :** నిర్మల్ జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సమయానుసారంగా ప్రతీ రెండు గంటలకు ఒకసారి పోలింగ్ కేంద్రాలలో నమోదైన పోలింగ్ శాతం వివరాలను తెలుసుకోవాలన్నారు. అధికారులు వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.

## మల్లన్న ఆలయంలో భక్తుడికి గుండెపోటు

### సీపీఆర్ చేసి.. ప్రాణాలను కాపాడిన ఎస్ఐ



**తెలంగాణ సేన ప్రతినిధి :** మహా శివరాత్రి సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తుడు ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురయిన సంఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో చోటుచేస్తుంది. బుధవారం దర్శనానికి వచ్చిన భక్తుడు ఒక్కసారిగా గుండెపోటు గుర్తై కింద పడిపోవడంతో ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్, పోలీస్ సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. అప్పటికప్పుడే సదరు భక్తుడికి సిపిఆర్ చేసిన పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ వెంటనే తమ పోలీస్ వాహనంలో చికిత్స నిమిత్తం హాస్పిటల్ కి తరలించాడు. భక్తుడు ఒర్సు శ్రీనివాస్ వీణవంక మండలం చల్లూరు గ్రామంగా తెలిసింది. ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చి అస్వస్థకు గురయ్యాడు. ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. భక్తుడు గుండెపోటుకు గురి కావడంతో అప్పటికప్పుడే స్పందించి ప్రాణాలు కాపాడిన ఎస్సైరమేశ్, పోలీస్ సిబ్బందిని భక్తులు, ప్రజలు అభినందించారు.

## శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి సంజయ్

### స్వామివార్లకు శేష వస్త్రాలు సమర్పించిన బండి సంజయ్





**తెలంగాణ సేన ప్రతినిధి :** దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న మహా శివరాత్రి మహోత్సవ వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి ఆలయ ఆవరణలోకి రాగానే ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో కొలువుదీరిన శ్రీ స్వామివారలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు వేద మంత్రోఛరణల మధ్య స్వామివార్లకు శేష వస్త్రాలను సమర్పించారు. దర్శనానంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ఆలయ అర్చక బృందం ఆశీర్వచనం గావించి స్వామివారి చిత్రపటం, మహా ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. భారతదేశ ప్రజలంతా సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు .ఆయన వెంట ఆయన వెంట భాజపా నాయకులు ప్రతాపరామకృష్ణ, గోపి, బండ మల్లేశం ,గోపు బాలరాజు, రాపల్లి శ్రీధర్ ,అల్లాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బిసి స్వరంగా వద్దకు వెళ్లకుండా హరీష్ రావు అడ్డుకున్న పోలీసులు

### రోడ్డుపైనే బైఠాయించి నిరసన




**తెలంగాణ సేన ప్రతినిధి :** శ్రీశైలం ఎడమ కాలువ ఎస్ ఎల్ బి సి సురంగంలో ఎన్ని మంది కార్మికులు చిక్కుకొని ఏడు రోజులుకు వస్తున్న ఇప్పటివరకు వారి ఆచూకీ ప్రభుత్వం కనిపెట్టకపోవడంతో, అక్కడ ఏమి జరుగుతుంది అని తెలుసుకోవడానికి బయలుదేరి వెళ్లిన బారస నేతలు హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడంతో, పోలీసుల తీరును నిరసిస్తూ హరీష్ రావు బృందం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎస్ ఎల్ బి సి సొరంగం వద్దకు తాము వెళ్లడానికి ఎందుకు అనుమతి ఇవ్వడం లేదంటూ హరీష్ రావు పోలీసుల పనితీరుపై మండిపడ్డారు . ముఖ్యమంత్రి ఆదేశం మేరకు పోలీసులు తమ ని సొరంగం మార్గము వద్దకు పంపడం లేదంటూ హరీష్ రావు ఆరోపించారు. చివరికి పదిమందికి సొరంగం మార్గం వద్దకు పంపించారు.

## చేసిన పాపం ఆ గుడిలో రూ.12తో కడిగేసుకోవచ్చు అందుకు రుజువుగా సర్టిఫికెట్ అందుకోవచ్చు



ఈ భూమండలంపై ఎన్నో ఆలయాలు ఉంటాయి. ఏ ఆలయం విశిష్టత దానికే ఉంటుంది. ఓ ఆలయంలో పూజలు చేస్తే సంతాన భాగ్యం కలుగుతుందని, మరో ఆలయంలో దైవాన్ని దర్శించుకుంటే ధన లబ్ధి చేకూరుతుందని, ఇంకో ప్రాంతంలోని ఆలయానికి వెళ్తే శని తొలగిపోతుందని, వేరొక ప్రాంతంలోని ఆలయంలో దైవ దర్శనం చేసుకుంటే చేసిన పాపాలు పోతాయని ఇలా రకరకాలుగా భక్తులు విశ్వసిస్తుంటారు. చేసిన పాపాలు పోగొట్టుకోవడానికి పరిహారాల కోసం కొందరు భారీ ఎత్తున ఖర్చులు కూడా చేస్తుంటారు. ఇవన్నీ మీరు వినే ఉంటారు. కానీ చేసిన పాపం పోయినట్టుగా సర్టిఫికెట్ సైతం ఇచ్చే ఆలయం గురించి ఎప్పుడైనా విన్నారా..? మనం ఇప్పుడు ఆ ఆలయం గురించే చెప్పుకోబోతున్నాం. మనిషి తెలియక కొన్ని, తెలిసి కొన్ని పాపాలు చేస్తుంటాడు. చేసిన పాపాలను కడిగేసుకోవడానికి ఆలయాలకు వెళుతుంటాడు. అంతేగాక పాప పరిహారాల కోసం సిద్ధాంతులు చెప్పే పూజలకు లక్షలు ఖర్చు చేస్తాడు. దోచిన దాంట్లో కొంత దానం చేస్తే పాపాలు తొలగిపోతాయని కొందరు దానధర్మాలు కూడా చేస్తుంటారు. ఇవన్నీ మామూలే. కానీ లక్షల్లో ఖర్చులు, భారీ దానాలు లేకుండానే ఓ ఆలయంలో కేవలం రూ.12 ఖర్చుతో పాపాన్ని కడిగేసుకోసుకోవచ్చు. పాపం పోయినట్టుగా సర్టిఫికెట్ కూడా పొందవచ్చు. ఇది వెరైటీ. మరె మీరు కూడా ఆ ఆలయం విశిష్టతను తెలుసుకోవాలనుకుంటున్నారా..? అయితే పదండి అక్కడికే వెళ్దాం. రాజస్థాన్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఒక పురాతన ఆలయం ఉన్నది. ఆ ఆలయం గత కొన్ని శతాబ్దాలుగా తీర్థ యాత్రలకు ప్రసిద్ధిగాంచినది. ఆ ఆలయాన్ని గిరిజనుల హరిద్వార్ అని కూడా పిలుస్తారు. ఆ ఆలయంలోనే ఎన్నో ఏళ్లుగా అక్కడికి వచ్చే భక్తులకు చేసిన పాపం పోయినట్లుగా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే ఆచారం ఉన్నది. దీన్నే గౌతమేశ్వర్ మహాదేవ్ పాపమోచన తీర్థంగా కూడా పిలుస్తారు. ఈ ఆలయం పక్కనే 'మందాకిని పాప విమోచిని గంగా కుంద్' అనే రిజర్వాయర్ ఉంది. ఆ జలాశయం నీటితో స్నానం చేస్తే సర్వ పాపాలు తొలగిపోతాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆ గుడిలో కేవలం రూ.12 చెల్లించి పుణ్య స్నానం చేయవచ్చు. రిజర్వాయర్‌లోకి వెళ్లలేని వారు గుడిలోని వాటర్ ట్యాంక్‌లో నింపిన రిజర్వాయర్ నీటితో స్నానం చేసినా సరిపోతుంది. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీగా ఆలయానికి తరలి వస్తుంటారని, వారందరికీ పాప విమోచన సర్టిఫికెట్ కూడా ఇస్తామని ఆలయ పూజారి చెప్పారు. ప్రతి ఏడాది ఆలయంలో దాదాపు 250 నుంచి 300 పాప విమోచన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ఆచారం దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం నుంచి కొనసాగుతున్నట్లు దేవాలయ అధికారులు చెబుతున్నారు.

## నామినీ అంశాన్ని తేలిగ్గా తీసుకుంటున్నారా ఈ సమస్యలు తప్పవు



కేతన్ ఓ ప్రైవేట్ ఉన్నతోద్యోగి. హైదరాబాద్‌లోని బహుళజాతి సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వయస్సు 45 సంవత్సరాలు. మొదట్నుంచీ అతనికి ఎలాంటి ఆరోగ్య సమస్యల్లేవు. కానీ ఒకరోజు ఉన్నట్టుండి హార్ట్ అటాక్‌తో మరణించాడు. తన పేరు మీద ఎల్ఐసీలో రూ.50 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ, రూ.30 లక్షల విలువైన షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌తోపాటు రూ.70 లక్షల బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లు ఉన్నట్టు తేలింది. కేతన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వాళ్లు మైనర్లు. తండ్రి సంపాదనపైనే ఆధారపడినవాళ్లు. అలాగే కేతన్ తల్లిదండ్రులిద్దరూ తనతోనే ఉండేవారు. వీళ్లకు అనారోగ్య సమస్యలూ ఉన్నాయి. కేతన్ ఎప్పుడూ తన ఆఫీసు పనిపైనే దృష్టిపెట్టేవాడు. అందుకే నామినీ విషయంలో పెద్దగా శ్రద్ధ తీసుకోలేదు. కానీ హఠాత్తుగా చనిపోవడంతో వాటాల విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కాబట్టే నామినీ అంశాన్ని ఎవరూ తేలిగ్గా తీసుకోరాదని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

**అంతా నామినీలకేనా?..**

నామినీగా ఎవరి పేరుంటే ప్రయోజనం వాళ్లకే ఉంటుందంటే కూడా సరికాదు. అసలైన హక్కుదారులెవరో గుర్తించి, వాళ్లకు లబ్ధి చేకూర్చేందుకు మాత్రమే నామినీ పాత్ర కీలకమవుతుంది. అందుకే కుటుంబ తగాదాలు, డబ్బుల కోసం గొడవలుపడి తిట్టుకోవడం కంటే నామినీల విషయంలో క్లియర్‌కట్‌గా ఒక లెక్కాపత్రాన్ని మనందరమూ తయారు చేసుకోవాలని న్యాయ నిపుణులు సలహా ఇస్తున్నారు. లీగల్‌గా ఆస్తి పత్రాలే రాయాల్సిన అవసరం ఉండకపోవచ్చు, ఒకవేళ ఏదైనా జరిగితే వాళ్ల పరిస్థితి ఏంటో కూడా గమనించి మనం ముందు జాగ్రత్తపడాలి. పైన చెప్పిన కేతన్ విషయంలో భార్యాపిల్లలకే మొత్తం డబ్బులిచ్చేస్తే, తల్లిదండ్రుల పరిస్థితేంటి?.. వాళ్ల బాగోగులు చూసే వాళ్లెవరు?.. కాబట్టి పెట్టుబడులు, ఆస్తుల కొనుగోళ్ల సమయంలో ఆచితూచి వ్యవహరించి, అందరికీ లాభం చేకూరేలా నిర్ణయాలు తీసుకుంటే.. ఎటువంటి ఇబ్బందులూ రావని అంటున్నారు.

**కుటుంబ సభ్యులకు చెప్పండి...**

బ్యాంకుల్లో డిపాజిట్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు, ఇన్సూరెన్స్.. ఇలా ఏది చేసినాసరే కుటుంబ సభ్యులకు వాటి గురించి చెప్పడం ఉత్తమం. వాళ్లకు తెలియకపోతే మీరెన్ని పెట్టుబడులు పెట్టినా వృథానే అని మరువద్దు. మీ తదనంతరం మీవాళ్లు కోర్టులు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని తెచ్చిపెట్టవద్దు. సక్సెషన్, లీగల్ హెయిర్ సర్టిఫికెట్లు అవసరమవుతాయి. ఇందుకు చాలా కష్టపడాల్సి వస్తుంది. ఒక్కోసారి సమాచారమేదీ లేకపోతే ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్‌కో, ఆర్బీఐ ఖాతాల్లోకో వెళ్లిపోయి మీ కష్టం బూడిదపాలవుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వద్ద రూ.35,012 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లున్నాయంటే నామినీకున్న ప్రాధాన్యతను మీరే అర్థం చేసుకోవచ్చు. అందుకే నామినీ పేరు తప్పక సూచించండి. ఆ పేరు రాసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. బీమా సొమ్ముకు భార్య పేరును.. షేర్లు, పీపీఎఫ్, ఎన్‌పీఎస్, మ్యూచువల్ ఫండ్స్‌కు చదువుకునే పిల్లలను.. మనపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఎఫ్‌డీలు అందేలా చర్యలు తీసుకుంటే ఉత్తమమని చెప్పవచ్చు. మొత్తానికి కుటుంబ పరిస్థితులనుబట్టి మనం బ్రతికున్నప్పుడే ఓ తెలివైన నిర్ణయం మాత్రం తీసుకోవాలి.

## అత్యాధునిక బాలిస్టిక్ క్షిపణి టెక్నాలజీ అభివృద్ధి చేస్తున్న పాకిస్థాన్ అమెరికా ఆందోళన




పాకిస్థాన్ తీరుపై అమెరికా శ్వేతసౌధం ఆందోళన వ్యక్తం చేసింది. అత్యాధునిక క్షిపణి టెక్నాలజీని పాకిస్థాన్ డెవలప్ చేస్తున్నట్లు వైట్‌హౌజ్ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. సుదీర్ఘ దూరం ప్రయాణించే బాలిస్టిక్ క్షిపణులను కూడా పాక్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ టెక్నాలజీతో తమకు కూడా ప్రమాదకరంగా మారనున్నట్లు అమెరికా చెప్పింది. పాకిస్థాన్‌కు చెందిన నాలుగు కంపెనీలపై ఇటీవల అమెరికా ఆంక్షలు విధించింది. దాంట్లో ఆ సర్కారు చెందిన నేషనల్ డెవలప్మెంట్ కాంప్లెక్స్ కూడా ఉన్నది. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ ఫినర్.. పాకిస్థాన్ ప్రోగ్రామ్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. పాక్ చేపడుతున్న లాంగ్ రేంజ్ మిస్సైల్ ప్రోగ్రామ్‌పై వత్తిడి తెస్తున్నామని, ఆ సమస్యను తీర్చేందుకు దౌత్య విధానాన్ని కూడా అవలంభిస్తున్నట్లు ఫినర్ తెలిపారు. పాక్‌లోని ఎన్డీసీతో పాటు అక్తర్ అండ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అఫిలియేట్స్ ఇంటర్నేషనల్, రాక్‌సైడ్ ఎంటర్‌ప్రైజ్ సంస్థలపై కూడా ఆంక్షలు విధించారు. ఈ సంస్థలు పాక్ బాలిస్టిక్ ప్రోగ్రామ్‌కు సహకరిస్తున్నట్లు తేలిందని అమెరికా చెప్పింది.

# చర్చ అంటే భయమెందుకు?




ఫార్ములా- ఈ రేస్ విషయంలో తనపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరైన సందర్భంలో, సరైన రీతిలో స్పందించారు. స్పందించడమే కాదు, ఏకంగా చర్చ పెట్టాలని స్పీకర్‌కు లేఖ రాసి విజ్ఞప్తి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత ఇరుకున పెట్టారు. అంతేకాదు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి, సభలోనే చర్చ పెట్టాలని సీఎం రేవంత్‌కు బహిరంగంగా సవాల్ విసరడం మరో డేరింగ్ స్టెప్. బహుశా కేటీఆర్ నుంచి ఇలాంటి సవాల్ వస్తుందని కాంగ్రెస్ పార్టీ గాని, రేవంత్‌రెడ్డి అండ్ కోటరీ గాని ఊహించలేదేమో. కేటీఆర్ సవాల్‌తో ఇప్పుడు కాంగ్రెస్‌లో కొత్త టెన్షన్ మొదలైంది. అసలే ఏడాదిగా అధికార పార్టీ అనేక ఇబ్బందులు పడుతోంది. ప్రభుత్వ వ్యూహాలన్నీ బూమరాంగ్ అవుతున్నాయి. ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడంలో అధికార కాంగ్రెస్ విఫలమవుతోంది. ఇదెవరో గాలినపోయే గన్నారావు చెబుతున్న మాటలు కావు, ఏకంగా తెలంగాణలో ఏఐసీసీ ఇన్‌చార్జ్, హైకమాండ్ దూత అయిన దీపాదాస్ మున్షీ అనేక సందర్భాల్లో చెప్పిన మాటలివి. నిన్నటికి నిన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పరిస్థితి మరీ దయనీయంగా ఉందని.. కేటీఆర్, హరీశ్‌రావును దీటుగా ఎదుర్కొనే నాయకుడు కాంగ్రెస్‌లో లేడని ఆమె కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అంతేకాదు, హైదరాబాద్ ప్రజలను, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడారు. అది వేరే సంగతి. అంతకుముందు ఢిల్లీ నుంచి వచ్చి రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ ఎ లా వెనుకబడి పోతోందో వర్క్‌షాప్ పెట్టి మరీ చెప్పారు. ప్రజల దృష్టిలో విపక్షాలను విలన్లుగా, విఫల నేతలుగా చిత్రీకరించే ప్రయత్నంలో అధికార పార్టీ నేతలే విలన్లుగా మిగిలిపోతున్నారు. ఈ అంశం, ఆ అంశం అన్న తేడా లేకుండా ప్రతి విషయంలోనూ అధికార పార్టీపై ప్రతిపక్షం పైచెయ్యి సాధిస్తోంది. ఇప్పుడు ఫార్ములా- ఈ రేస్ విషయంలో కేటీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకున్నది. కానీ, జరుగుతున్న పరిణామాలు గమనిస్తే మళ్లీ ఆ పార్టీకి చుక్కెదురు అవుతుందనిపిస్తోంది. కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాల అంశంలో కేసీఆర్‌ను టార్గెట్ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఫార్ములా-ఈ రేస్ విషయంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని చేతులు కాల్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఫార్ములా- ఈ రేస్‌లో అవినీతి జరిగిందని, అందులో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హస్తం ఉందని ఎప్పటినుంచో కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. లీక్ వార్తలతో ప్రాపగాండా చేస్తోంది. ఇదిగో కేటీఆర్ అరెస్టు, అదిగో అంటూ కొన్ని నెలలుగా పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఆనవాళ్లు లేకుండా చేస్తానని, కేసీఆర్ గుర్తులు లేకుండా చేస్తానని రేవంత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ క్రమంలోనే మొదటి ఏడాది గత ప్రభుత్వాన్ని ప్రజలకు దగ్గర చేసిన పథకాలపై విష ప్రచారం, తప్పుడు ఆరోపణలు చేసి అరెస్టులంటూ ఊదరగొట్టారు. ఆ ప్రయత్నాలన్నీ బూమరాంగ్ కావడమే కాదు, మళ్లీ కేసీఆర్ పాలన కావాలని ప్రజలు బలంగా కోరుకునేలా చేశాయి. ఇప్పుడేమో పర్సనల్‌గా కేటీఆర్‌ను టార్గెట్ చేశారు. అయితే తాజాగా ఫార్ములా- ఈ రేస్ కేసు విషయమై కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం, మంత్రులపై ఇంటాబయట కేటీఆర్ పోరు ఎక్కువైంది. ఆ ఫ్రస్టేషన్ ముఖ్యమంత్రి, మంత్రులు మాటల్లో అనేక సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. ఒకవైపు ఇంటి పోరు, మరోవైపు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయాలని ప్రజల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మధ్య ప్రభుత్వ పెద్దలు కొట్టుమిట్టాడుతున్నారు. ఫ్రస్టేషన్‌లో మనిషి విచక్షణ కోల్పోయి మాట్లాడతాడని, ఎప్పుడూ ఏ నిర్ణయం తీసుకుంటారో.. సమయం, సందర్భం లేకుండా వారి వ్యవహారశైలి ఉంటుందని సైకాలజిస్టులు చెబుతుంటారు. ముఖ్యమంత్రి, మంత్రులు కూడా మనుషులే కదా. ఫార్ములా- ఈ రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, అధికారుల పాత్ర కూడా ఏమీ లేదని, తానే స్వయంగా తన మంత్రిత్వ శాఖ నుంచి నగదును నిర్వాహకులకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు కేటీఆర్ పలుమార్లు చెప్పారు. ఇందులో ఎలాంటి తప్పు జరగలేదని కేటీఆర్ చాలా సందర్భాల్లో స్పష్టం చేశారు. అయితే, తాజాగా కేటీఆర్‌పై కేసు నమోదు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ, విద్యుత్ ఒప్పందాలపై విచారణ కమిషన్ల పేరుతో కాంగ్రెస్ మొదటి ఏడాది కాలం వెళ్లదీసింది. ఒట్లు, తిట్లు, బూతులతో పాలనను గాలికొదిలేశారు. ఇప్పుడు ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ చుట్టూ రాజకీయాలు తిప్పుతూ రెండో ఏడాది కూడా గ్యారెంటీలు అమలు చేయకుండా కాలం వెళ్లదీసే వ్యూహాల్లో అధికార పార్టీ నేతలు ఉన్నారు. ఫార్ములా-ఈ రేస్ విషయంలో ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై కేటీఆర్ మొదటి నుంచి సవాల్ విసురుతూనే ఉన్నారు. లీక్ వార్తలతో కేటీఆర్‌ను భయపెట్టేందుకు సర్కారు ఎంత కఠినంగా వ్యవహరించాలని చూస్తుందో అంతే కఠినంగా తప్పు చేస్తే అరెస్టు చేసుకోవాలని కేటీఆర్ ధైర్యంగా సవాల్ చేస్తున్నారు. తాజాగా కేసుకు ముందే దమ్ముంటే అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా- ఈ రేస్‌పై చర్చ పెట్టాలని ఏకంగా స్పీకర్‌కు, సీఎంకు లేఖ రాసి అధికార పార్టీని కేటీఆర్ ఇరుకున పెట్టారు. ఈ క్రమంలో అధికార పార్టీని డిఫెన్స్‌లో పడేశారు. కేటీఆర్ డిమాండ్ చేసినట్టు సభలో చర్చ పెడితే వాస్తవాలు తెలంగాణ సమాజానికి తెలుస్తాయి. ఒకవేళ సభలో చర్చకు పెట్టకపోతే ఇన్ని రోజులు కేటీఆర్‌పై ప్రభుత్వం చేసిందంతా తప్పుడు ప్రచారం అని జనాలకు అర్థమైపోతుంది. అందుకే, అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయంలో కేటీఆర్‌పై కేసు పెట్టించి, లగచర్ల రైతుల విడుదల విషయం మీడియాలో ప్రచారానికి నోచుకోకుండా మరో డైవర్షన్ ఎత్తుగడకు కాంగ్రెస్ సర్కార్ పాల్పడింది.

# అణ్వస్త్ర ప్రమాదం



ప్రపంచవ్యాప్తంగా ఆయుధ పోటీ క్రమంగా పెరుగుతుండటం ఆందోళనకరం. ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేసిన దీర్ఘకాలిక క్షిపణులు రష్యా భూభాగంపై ప్రయోగించేందుకు అనుమతిస్తూ అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల ఫర్మానా జారీచేయడంతో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. ఆ వెనువెంటనే ఉక్రెయిన్ కొన్ని క్షిపణులను రష్యాపై వేసింది కూడా. దీన్ని అమెరికా ప్రత్యక్ష దాడిగా భావిస్తామని, అణ్వస్త్ర వినియోగ విధానంలో మార్పులు చేస్తామని రష్యా వెల్లడించడం ఓ ప్రమాదకరమైన మలుపు. దీంతో అణ్వస్త్ర ముప్పు మరోసారి తెరమీదకు వచ్చింది. అణ్వస్త్ర పరిమితి ఒప్పందాలను తాము ఖాతరు చేయబోమని, అవి కాలగర్భంలో కలిసిపోయినట్టేనని రష్యా సైనికదళాల ప్రధానాధికారి జనరల్ వాలెరీ గెరాసిమోవ్ తేల్చిచెప్పడం గమనార్హం. పాశ్చాత్య ప్రపంచంపై నమ్మకం సన్నగిల్లడమే ఇందుకు కారణమని ఆయన తేల్చి చెబుతున్నారు. 2002లో విధ్వంసక క్షిపణుల ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంతో అగ్రరాజ్యాల మధ్య ఆయుధ పోటీకి బీజం పడింది. అప్పటినుంచి ఒకదాని తర్వాత ఒకటిగా ఆయుధ పరిమితి ఒప్పందాలన్నీ కుప్పకూలుతూ వచ్చాయి. చివరగా మిగిలిన వ్యూహాత్మక ఆయుధ పరిమితి ఒప్పందం గడువు 2026 ఫిబ్రవరిలో ముగిసిపోతుంది. అంటే గత 50 సంవత్సరాల చరిత్రలో బడా అణ్వస్త్ర దేశాల మధ్య ఎలాంటి ఒప్పందాలు లేని పరిస్థితిని ప్రపంచం ఎదుర్కోబోతున్నది. రష్యా చేసిన ప్రకటనతో అది అంతకంటే ముందే జరిగిపోతుందేమోననే భయాలు వెంటాడుతున్నాయి. నేటిరోజుల్లో అణ్వస్త్ర సమస్య అనేది అమెరికా రష్యాలకే పరిమితం కాలేదు. చైనా కూడా ఆయుధపోటీలోకి దూకుడుగా దిగడంతో పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. ఈ సరికే చైనా 500 అణ్వస్త్రాలు పోగేసుకున్నట్టు ఒక లెక్క. దశాబ్దం చివరి నాటికి ఆ సంఖ్యను వెయ్యికి, 2035 నాటికి అమెరికా, రష్యాలతో సమానంగా 1,500కు పెంచాలని చూస్తున్నది. దీనివల్ల అణ్వాయుధ పరిమితి చర్చల్లో పాల్గొనాల్సిన దేశాల సంఖ్య రెండు నుంచి మూడుకు పెరుగుతుంది. అణ్వస్త్రాల సమస్య భారత్ తలుపు తడుతున్న సూచనలూ కనిపిస్తున్నాయి. పొరుగున ఉన్న పాక్, చైనాలు ప్రకటిత అణ్వస్త్ర దేశాలు. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజా తిరుగుబాటు ఫలితంగా షేక్ హసీనా ప్రధాని పదవి కోల్పోయి దేశం వదిలి పారిపోయిన తర్వాత భారత వ్యతిరేక శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత సెప్టెంబర్‌లో షహీదుజ్జమాన్ అనే వివాదాస్పద ప్రొఫెసర్ బంగ్లా-పాక్ మధ్య అణ్వస్త్ర రక్షణ ఒప్పందం కుదిరితే బాగుంటుందని చేసిన సూచన సంచలనం కలిగించింది. సాధ్యాసాధ్యాల సంగతి అటుంచితే ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. అణుయుద్ధం ఎప్పుడు, ఎవరి మధ్యన జరిగినా విజేతలంటూ ఎవరూ మిగలరనేది నిర్వివాదాంశం. మూడు దశాబ్దాలుగా ఒప్పందాలు కలిగించిన భరోసా అంతమైపోతున్నది. 1962లో క్యూబా సంక్షోభం తర్వాత మళ్లీ అణ్వస్త్రాల ఉపయోగం గురించిన మాటలు వినవస్తున్నాయి. ఇది ఎటు దారితీస్తుంది!

# ఇంగ్లిష్.. వింగ్లిష్!




రమాయణం


మొదట్లో మాకు ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగానే తెలుసు. అన్ని సబ్జెక్టుల్లానే. దాన్ని చూసేవాళ్లం, చదివేవాళ్లం! రానురాను అది రాజులకే రాజు అని తెలియవచ్చింది. ఏదో తరగతికి వచ్చేసరికి కొందరు పిల్లలు ఇంగ్లిష్‌లో ఫెయిల్ అయ్యేవారు. క్లాసులో సార్ మార్కుల లిస్టు చదువుతూ.. ఒక్కొక్కళ్ల పేపరులోని జవాబులు పైకి చదివేవారు. అందులోని హైలైట్స్‌ను పెద్దగా స్టీరియో ఫోనిక్ సౌండ్‌తో చెప్పేవారు. దాంతో ఆ పిల్లల్లో కొందరు తలలు వేలేసి పిచ్చి చూపులు చూసేవారు. మరికొందరు చేసేదేమీ లేక.. మిగతా వారితోబాటు కలిసి నవ్వేవారు. ఇంగ్లిష్ పాఠాలు అంటేనే.. నాకు బాగా గుర్తొచ్చే విషయాలివి. ఇక ఇంగ్లిష్‌లో అందరికన్నా ఎక్కువ మార్కులొచ్చిన వాళ్లను దేవతల్లా చూడటం కూడా నాకు అనుభవమే. చాలాసార్లు ఆ సూపర్‌స్టార్ ఇమేజ్ నేను కూడా పొందాను లెండి! 'ఓర్నీ! ఇంగ్లిష్‌కు గింత ఖదర్ ఉండుడు ఏంది?!' అనిపించేది. అంతకన్నా ఎక్కువ లెక్కలకు, ఆ వరుసలోనే సైన్సుకు కూడా విలువ ఉన్నా.. ఇంగ్లిష్ సంగతే వేరు. రాత్రిపూట తొమ్మిది గంటలకు రేడియోలో ఇంగ్లిష్ వార్తలొచ్చేవి. అందులో 'దిస్ ఈజ్ ఆల్ ఇండియా రేడియో. ద న్యూస్ రీడ్‌బై లతికా రత్నం' అని మొదలవగానే.. చెప్పరాని ఆనందం కలిగేది. 'అరే.. ఎప్పటికైనా గీమె తీరుగ ఇంగ్లిష్ మాట్లాడాలె!' అనుకొని ఆ మాటలకు అర్థం తెలియకున్నా.. అచ్చం అలాగే అనుకరించేదాన్ని. ఆ మాటలను మళ్లీ మా క్లాసులో లీడర్ పీరియడ్‌లో నోటికి చదువుతుండేదాన్ని. మా దోస్తులందరూ పరమానందపడి.. "అబ్బ! రమణ ఎంత ఇంగ్లిషొస్తోంది! ఏం చదువుతున్నది పో!" అనేవారు. అప్పుడు సంబరంగానే ఉండేది గానీ.. ఆ తరువాత నా రోగం కుదిరింది. మా క్లాస్‌మేట్స్ ఇంగ్లిష్‌లో ఏ డౌట్ వచ్చినా నన్నే అడిగేవారు. "పీయూటీ.. పుట్ అయితే, సీయూటీ.. కట్ ఎట్ల అయితదబ్బా?!" అనీ, "సీ అక్షరాన్ని ఒకసారి 'స' పలుకుతరు, ఒకసారి 'క' పలుకుతరు. ఎందుకబ్బా?!" అని ప్రశ్నలతో నన్ను చుట్టుముట్టేవారు. ఆ ఇంగ్లిష్ రూల్స్ నేనే కనిపెట్టినట్టు అడుగుతుంటే.. ఏం చేయాలో తోచక.. "ఎమ్మోనోయ్! నాక్కాడ తెల్వదు. కనుక్కోని చెప్తు!" అని సాయంత్రం అమ్మను అడిగేదాన్ని. అమ్మ నవ్వి.. "నాకు ఇంగ్లిష్ ఎక్వ తెల్వదు బిడ్డా! ఏదో చిన్న చిన్నవి చెప్తు!" అనగానే.. 'మా అమ్మకు కూడా తెలియని విషయం ఉంటుందా!?' అని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యేదాన్ని. చాలారోజుల వరకు ఆ ప్రశ్నలకు సమాధానాలను నాకు ఎవరూ వివరంగా చెప్పలేకపోయేవారు. నేను తొమ్మిదో తరగతిలో ఉండగా బళ్లో మా ఆడపిల్లల మధ్య ఓ ఒప్పందం జరిగింది. అందుకు మూల కారణం మా కజిన్ వకుళక్క. వాళ్ల మామయ్యల్లో ఒకాయన బ్యాంకు మేనేజర్, ఒకాయన ఇంజినీర్, మరొకాయన డాక్టర్.. ఇలా పెద్ద ఉద్యోగాల్లో ఉండటం వల్ల తను ఎక్కువగా హైదరాబాద్‌కూ, ఇతర నగరాలకూ వెళ్తుండేది. అలా వెళ్లి వచ్చినప్పుడల్లా ఓ కొత్త విషయం పట్టుకొచ్చేది. ఈసారి రాగానే.. "ఏయ్.. మన గర్ల్స్ అందరం ఇంగ్లిష్‌లోనే మాట్లాడుకుందాం. అట్లయితె మనకు మస్తు ఇంగ్లిష్ ఒస్తది!" అన్నది. "మనకు అస్సలుకే ఇంగ్లిష్‌రాదు గదబ్బా! ఏమి రాంది ఎట్ల మాట్లాడుత?! ఇన్నోల్లు అందరు నవ్వుతరు" అన్నది.. మా ఫ్రెండ్స్‌లో ఓ అపశకున పక్షి. "ఎహె! ఏం కాదు తియ్యి. నవ్వేటోండ్లేమన్న పండితులా?!" అన్నది మా కజిన్. ఆ క్షణం నుంచీ మేం ఏం మాట్లాడినా.. వచ్చీ రాని ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలని శిఖరాగ్ర సమావేశంలో నిర్ణయించారు. ఇక చూస్కోండి.. ఒక్కొక్కళ్ల ప్రతాపం ఒక్కో మాదిరిగా చూపించడం మొదలుపెట్టారు. "నువ్వు ఒస్తున్నవా?!" అనేదానికి.. "యూ కమింగ్?" అనీ, "నేను నీళ్లు తాగుతున్నా" అనేందుకు.. "అయామ్ వాటర్ డ్రింకింగ్" అనీ.. ఇలా ఇంగ్లిష్‌కి వేరే డిక్షనరీనే మొదలు పెట్టారు. ఓసారి ఇలాగే మాటల మధ్యలో కంకులను ఇంగ్లిష్‌లో ఏమంటారో నాకు అస్సలు గుర్తు రాలేదు. కంకులంటే మాకు మక్కజొన్న కంకులే! వెంటనే అక్కను అడిగాను. తను తడుముకోకుండా చెప్పింది. "అయ్యో! గదిగూడ తెల్వదా?! కంక్స్ అంటరు" అన్నది. ఆ తరువాత 'మెయిజ్' అన్నమాట గుర్తొచ్చి ఇద్దరం పడీపడీ నవ్వుకున్నాం. మాకు నైంత్‌లో వాసుదేవ రావు సర్, టెంత్‌లో ఎమాన్యూల్ సర్ ఇంగ్లిష్ ఎంత బాగా చెప్పేవారంటే.. నాకు నేనే ఇంగ్లిష్ పాఠం కింది ప్రశ్నలకు జవాబులు రాసుకొచ్చేదాన్ని. అది చూసి ఒకట్రెండు కరెక్షన్స్ చెప్పి.. మొత్తం క్లాసుకంతా అవే జవాబులు రాయించేవారు. అమ్మాయిల బ్యాచ్ ఇంకొక సిస్టం ప్రవేశపెట్టింది. ప్రతివాళ్లకూ ఒక క్లోజ్ ఫ్రెండ్ ఉండాలనీ, వాళ్లని 'డూ' అనాలని ఆ తీర్మానం ఉద్దేశం. 'ఒకళ్లకు ఒక్కరే దగ్గరి ఫ్రెండు ఎట్ల ఉంటరు?! కనీసం ఇద్దరు ముగ్గురు ఉండాలె గానీ!' అనేది నా అభిప్రాయం. ఎవరి క్లోజ్ ఫ్రెండైనా ఓరోజు స్కూలుకి రాలేదంటే ఆమె ఫ్రెండును.. "ఏందోయ్.. మీ డూ ఏది?!" అనడిగేవారు. ఆ మధ్య ప్రభాస్ ఏదో సినిమాలో ఫ్రెండ్స్‌ని సంబోధిస్తూ.. "డ్యూడ్" అంటుంటాడు. అది చూశాక మేము స్కూలు రోజుల్లో 'డూ' అని పిలుచుకున్నది గుర్తొచ్చి.. 'అరె.. మేం అప్పుడే గింత దూరం ఆలోచించినమా?!' అనిపించింది. నేను హైదరాబాద్ రెడ్డి కాలేజీలో ఇంటర్ చదివేటప్పుడు మొదటిసారి ఇంగ్లిష్ మీడియంలో చదివిన వాళ్లను చూశాను. వాళ్లు చూడ్డానికి మాలాగే మామూలు మనుషుల్లాగే ఉన్నారు గానీ, మహా టెక్కు ఉండేది. తెలుగు మీడియంలో చదివేవాళ్లను పురుగుల్లాగా చూసేవారు. అది చూసి మా క్లాసులో ఉన్న రజనీ పద్మకుమారి అనే అమ్మాయి.. "మనం వీళ్లను దెబ్బ కొట్టాలంటే ఇంగ్లిష్‌తోబాటు మిగతా సబ్జెక్ట్స్‌లో వాళ్లకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలోయ్! అప్పుడే వాళ్ల పొగరు అణుగుతుంది" అనేది. ఆ పిలుపు మేరకు నిజంగానే క్వార్టర్లీ ఎగ్జామ్స్‌లో నేను, అనిత అనే అమ్మాయి టాపర్స్‌గా వచ్చాం. అప్పట్లో మార్కులెక్కువ వేసేవారు కారు. కానీ, ఇంగ్లిష్‌లో నాకు 92 మార్కులొచ్చాయి. మా ఇంగ్లిష్ లెక్చరర్ రత్నాకరం మేడమ్ చాలాబాగా పాఠాలు చెప్పేవారు. మొత్తానికి ఇంగ్లిష్ మీడియం వాళు కొంచెం తగ్గారు. ఆ తరువాత కొన్నేళ్లకు బ్యాంకులో చేరాకే నేను ఇంగ్లిష్ బాగా నేర్చుకున్నాను. నేర్చుకోవడమే కాదు.. కొత్తవాళ్లకి, జూనియర్స్‌కి ట్రయినింగ్ క్లాసులు కూడా తీసుకోగలిగాను. అందుకు మా బ్యాంకుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

# తెలుగు భాషపై చిన్నచూపు




వేల ఏండ్ల నుంచే తెలుగు భాష ఉన్నదనడానికి నిలువెత్తు సాక్ష్యం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలోని బొమ్మలమ్మగుట్టపై ఉన్న కురిక్యాల శాసనం. 2008, అక్టోబర్ 31న నాటి కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించడానికి ఈ 'కురిక్యాల శాసనం' చాలా దోహదపడింది. ఈ శాసనాన్ని జినవల్లభుడు క్రీ.శ.945లోనే వేయించినట్టు చరిత్ర చెప్తున్నది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ రాష్ట్రంలో పాలనాపరంగా మాతృభాష సంపూర్ణంగా అమలుకాకపోవడం భాషాభిమానులను ఆశ్చర్యాన్ని గురిచేస్తున్నది. పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే తెలుగును పాఠ్యాంశంగా చూడటం కడు శోచనీయం. ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు భాష పూర్తిగా కనుమరుగైపోయింది. 90 శాతం ప్రైవేటు కళాశాలలు సంస్కృతాన్నే ప్రోత్సహిస్తున్నాయి. ఇదిలాగే కొనసాగితే మాతృభాష మాట్లాడుకోవడానికి మాత్రమే మిగిలిపోతుంది. పుస్తకాల్లో, మస్తకాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలుగు భాష సంపూర్ణంగా అమలుకానందుకు బాధపడాలో, సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాషను ఎక్కువగా వాడుతున్నందుకు సం తోషపడాలో అర్థం కావడం లేదు. ఇదిలా ఉంటే సినిమా పేర్లను కూడా తెలుగులో పెట్టకుండా దేశంలోని ఇతర భాషల్లో వాడుతుండటం నిజంగా తెలుగు భాషను కించపరుస్తున్నట్టే లెక్క. ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్టు ఇలాగే వ్యవహరిస్తే%ొ% మాతృభాష అయిన తెలుగు భాష కొన్ని రోజుల్లో మృతభాషగా అవుతుందేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి.

# అడవుల రక్షణ బాధ్యత ఆదివాసీలదేనా?



దేశ వనరులను కాపాడాల్సిన బాధ్యత కేవలం ఆదివాసులదే కాదు, మిగతా వారిపై కూడా ఉంది. సహజ వనరులను కాపాడే క్రమంలో ఆదివాసీల జీవితాలు బలవుతున్నాయి. బీర్సాముండా, గుండాదర్, కుమ్రం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగంలో ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ 1/70, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఆదివాసీల అభ్యున్నతే వీటి లక్ష్యం. కానీ, పాలకులు ఆ చట్టాలను అమలు చేయడం లేదు. కొద్ది నెలలుగా మధ్య భారతదేశంలో, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల మీద పెద్దఎత్తున అణచివేత కొనసాగుతున్నది. ఆదివాసీ గూడెంల సమీపంలో వందలాది పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసి వారిని ఆందోళనకు గురిచేస్తున్నారు. మూలవాసీ బచావో మంచ్ నాయకుడు రఘు మాటల్లో ఈ దేశ వనరులను కాపాడేందుకు ఆదివాసులు చేస్తున్న పోరాటాన్ని మిగతా సమాజం పట్టించుకోవడం లేదు. ఇది ఆదివాసీలకు సంబంధించిన సమస్యగా అందరూ చూస్తున్నారు. 1980 నుంచి మావోయిస్టులు ఆదివాసీ సమాజంలోకి, దండకారణ్యంలోకి ప్రవేశించి అక్కడ జరిగే అమానుషం, ఫారెస్టు వాళ్ల దోపిడీలను అరికట్టడం కోసం కృషి చేశారు. కానీ, 1993లో ప్రత్యేక చట్టం వచ్చాక దండకారణ్యంలోని కోట్లాది విలువైన వనరులపై కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారుల కన్నుపడింది. వనరుల దోపిడీకి ఆదివాసుల భూములను ఆక్రమించేందుకు నాటి నుంచి నేటి వరకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆదివాసీలకు మావోయిస్టులు మద్దతుగా ఉన్నందుకే 2005లో సల్వాజుడుం మారణ హోమాన్ని సృష్టించారు. ఐదేండ్లలో మూడు వేల గ్రామాలను దగ్ధం చేశారు. 450 మందిని అతి కిరాతకంగా హత్య చేశారు. ఆ క్రమంలోనే ఎర్రబోరు, దోర్నపాలు, కుంట ప్రాంతాల్లో సల్వాజుడుం బేస్ క్యాంప్‌లుగా మార్చి ఒక్కొక్క క్యాంపులో 50 వేలకు పైగా ఆదివాసీలను నిర్బంధించిన స్థితిని మనందరం చూశాం. చివరికి ప్రొఫెసర్ నందిని సుందర్ పోరాటం, జస్టిస్ సుదర్శన్ తీర్పు కారణంగా సల్వాజుడుం రద్దయిందేమో కానీ, దాని మరొక రూపం డీఆర్‌జీ నేటికీ వేటాడుతూనే ఉన్నది. ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడినందుకు సునీత పొట్టం అనే ఆదివాసీ, మూలవాసీ బచావో మంచ్ నాయకురాలిని బలవంతంగా అరెస్టు చేశారు. అదేవిధంగా 2021 నుంచి సిలింగేర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాయుధ బలగాల క్యాంపులకు వ్యతిరేకంగా మూలవాసీ బచావో మంచ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఆదివాసులందరూ మావోయిస్టులేననే దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రభుత్వం చేస్తున్నది. ఈ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లు, ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడుతున్న హక్కుల నేతలను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు. ఆదివాసీల సమస్యల గురించి ఎవరూ మాట్లాడొద్దా? ఇదే విధంగా సోనిసూరీ అనే ఆదివాసీ హక్కుల కార్యకర్తను నిర్బంధించారు. చనిపోయిన భర్తను చూసేందుకు కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతను అణచివేస్తున్నారు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో కగార్ మారణకాండ కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్నాయి. ప్రభుత్వాలే దళారీగా మారి పెట్టుబడిదారులకు సహజ వనరులను అప్పగించడం దారుణం. 2009లో మావోయిస్టు పార్టీ దేశానికి ప్రమాదకరమని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. చెప్పినట్టే ఏకపక్ష దాడులకు దిగారు. సరిహద్దుల్లో ఉండాల్సిన సాయుధ బలగాలు మధ్యభారతంలోకి ప్రవేశించాయి. అదే ఇప్పుడు ఆపరేషన్ కగార్‌గా మారింది. ఇప్పుడు దంతెవాడ, బస్తర్ ప్రాంతాలతో పాటు బీజాపూర్ జిల్లా కూడా ఇనుప ఖనిజపు పుట్టినిల్లుగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు ఒక స్టీల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం 2005లో ఒప్పందం కుదుర్చుకున్నది. దానికి తోడు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు పనిచేస్తున్నది. కంపెనీలతో జరిగిన ఒప్పందాల వల్లనే ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతున్నది. తద్వారా ప్రజలను చంపైనా సరే వనరులను అప్పగించాలనే స్థితికి ప్రభుత్వాలు చేరిపోయాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తున్నందున వాటిని అణచివేసేందుకు అనేక రకాల ఆపరేషన్లు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఆదివాసీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్, 2017లో ఆపరేషన్ సమాధాన్, నేడు ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల హత్యాకాండ కొనసాగుతున్నది. వేలాది మంది ఆదివాసీలు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఏడాది జనవరి 1న బీజాపూర్ జిల్లా ముగ్దుం గ్రామానికి చెందిన 6 నెలల సోడి మంగ్లీతో మొదలైన హత్యాకాండ 275కు చేరింది. తెలంగాణలోనూ సెప్టెంబర్ 5న రఘునాథపాలెంలో ఏడుగురిని హతమార్చారు. డిసెంబర్ 1న ఆరుగురికి విషం పెట్టి మరీ కాల్చిచంపారు. కనీసం ఆ మరణాలపై సత్యశోధన చేయడానికి కూడా ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నిషేధిత ప్రాంతంగా మారిపోయింది. హక్కుల సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదు. ఎమర్జెన్సీ కాలంలోనూ ఇంతటి దారుణమైన పరిస్థితి లేదు. అందుకే ప్రజలు స్పందించాలని కురుసం శంకర్, రఘు లాంటి మేధావులు కోరుతున్నారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేతలు ఎన్నడికీ విజయవంతం కావు. తెలంగాణ ఉద్యమమే అందుకు నిదర్శనం. మావోయిస్టుల సాకుతో ఆదివాసీలను నిర్బంధిస్తే ఉద్యమాలు ఆగవు. ప్రజాస్వామిక పోరాటాలను నిషేధించిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించవు. పాలించే నైతిక హక్కును పాలకులు కోల్పోతారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. మూలవాసీ బచావో మంచ్‌పై నిషేధం ఎత్తివేయాలి. మరీ ముఖ్యంగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది. ఆదివాసీలపై చేస్తున్న హత్యాకాండ పట్ల ప్రజల నుంచి మద్దతు దక్కని పక్షంలోనే ప్రభుత్వాలు అత్యంత దారుణంగా నరమేధాన్ని సృష్టిస్తాయి. ఈ విధానాన్ని మనమంతా ఖండించాలి. దేశ మూలవాసులైన ఆదివాసుల జీవించే హక్కును కాపాడుదాం. ఆపరేషన్ కగార్, ఆదివాసీ హననానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం.


# అనగనగా పెద్ద కథ!




**తెలుగు సాహిత్య ప్రపంచంలో కథ లేదా కథా సాహిత్యానికి ఒక విశిష్ట స్థానం ఉన్నది. 'కథ'ను అనగనగా అని మొదలుపెట్టి 'కథ కంచికి మనం ఇంటికి' అంటూ కథను ముగించడం తెలుగు కథకుల అలవాటు.**

'నిజ జీవితం ఆధారంగా అల్లబడిన సంఘటనల సమాహారం కథ' అని కొందరు, 'కల్పిత ప్రపంచ సమాహారం కథ' అని మరికొందరు కథకు రకరకాల నిర్వచనాలను ఇచ్చారు. కథలో ఉండాల్సిన నీతి విస్తృతం, ఎత్తుగడ, సంవేదన, నడక తీరు, ముగింపు, పరిమిత పాత్రలు, పాత్ర స్వభావాలు, ఏక వస్తు స్వరూపతల గురించి బొడ్డపాటి కుటుంబరాయ శర్మ, జె.నాగయ్య, పోరంకి దక్షిణామూర్తి వంటి అనేకమంది పండితులు అనేకరకాల అభిప్రాయాలను తెలియజేశారు. 'అనగనగా..' అంటే నిజంగా 'చాలాకాలం కిందట' అనే అర్థమేనా? కొంచెం తెలివితేటలు కలిగిన విద్యార్థి 'అనగనగా ఒక పిల్లి ఉంది అంటే చాలాకాలం కిందట ఒక పిల్లి ఉంది' అని అర్థం చెప్పుకోవాలా?, అలాగే 'అనగనగా ఒక రాజు అంటే చాలాకాలం కిందట ఒక రాజే ఉన్నాడని చెప్పుకోవాలా' అని ప్రశ్నిస్తే'అది అంతేలేరా' అని కొందరు గురువులు మృదువుగా మందలిస్తే, మరికొందరు గురువులు పిదప కాలం బుద్ధులు. దిక్కుమాలిన సందేహాలు అని విసుక్కుంటారు. ఏదేమైనా 'కథ్' అనే సం స్కృత ధాతువు నుంచి 'కథ' అనే పదం పుట్టింది. 'చెప్పు ట, సంభాషించుట' అని దీనికి అర్థాలుగా చెప్పవచ్చు. కథల్లో ఇతి వృత్తాన్ని బట్టి పురాణ కథలు, శృం గార కథలు, హాస్యకథలు, క్రైం కథ లు, రాజకీయ కథలు, అభ్యుదయ కథలు, స్త్రీవాద కథలు, దళిత కథలు వంటివి అనేకం ఉన్నాయి. ప్రాచుర్యాన్ని బట్టి చందమామ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, పంచతంత్ర కథలు, విక్రమార్క కథలు, కాశీమజిలీ కథలు, బేతాళ కథలు, తాతమ్మ కథలు, పిట్ట కథలు వంటి వాటితో పాటు తెలుగు సాహిత్యంలో ప్రత్యేకంగా తెనాలి రామకృష్ణ కథల వంటి హాస్య కథలున్నాయి. ఇంకా హరి కథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, సైన్స్ కథలు, పొడు పు కథల వంటి అనేకరకాల కథలున్నాయి. ఈ ఆధుని క కాలంలో సినిమా కథల వంటివి కూడా ఉన్నాయి. తెలుగు కథలకు నిలయమైన 'కథా నిలయం' అనే పేరు గల గ్రంథాలయాన్ని 1997 ఫిబ్రవరి 22న శ్రీకాకుళంలో కాళీపట్నం రామారావు స్థాపించారు. తిక్కన శిష్యుడైన కేతన రాసిన 'దశకుమార చరిత్ర' కథా కావ్యం కాగా ఆధునిక కాలంలో గురజాడ వేంకట అప్పారావు రాసిన 'దిద్దుబాటు' అనే కథ తెలుగులో తొలి కథ అని అంటారు. ఇక బండారు అచ్చమాంబ, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ వంటి వారు గురజాడ అప్పారావు కంటే ముందే కథా రచనకు శ్రీకారం చుట్టారు. ఆపై వేలూరి శివరామ శాస్త్రి, కొమర్రాజు వెం కటలక్ష్మణరావు, చింతా దీక్షితులు, కాళోజీ, చలం, బోయినపల్లి రంగారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ముని మాణిక్యం, బోయ జంగయ్య, పులిపాటి గురుస్వామి, అల్లం రాజయ్య, అడవి బాపిరాజు, భమిడిపాటి కామేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, పీవీ, మల్లాది రామకృష్ణ శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, గూడూరి సీతారాం, సామల, యశోదారెడ్డి, అఫ్సర్, ముళ్లపూడి వెం కటరమణ, మంజుశ్రీ, చాగంటి సోమయాజులు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, హితశ్రీ, కొలకలూరి ఇనాక్, కాలువ మల్లయ్య, వాకాటి పాండురంగారావు, భానుమతి, చెరబండరాజు, ఓల్గా, హుమాయూన్ సం ఘీర్, ధీరజ్ కశ్యప్, వేముగంటి.. ఇలా చెప్పుకొంటూ పోతే తెలుగు కథా రచయితల నామధేయాలే చిన్నపాటి గ్రంథం అవుతుంది. నాడు చిన్న పిల్లలు నిద్రపోవడానికి తల్లిదండ్రులు లేదా నానమ్మ తాతయ్యాదులు చిన్నచిన్న కతలు చెప్పేవారు. తెలుగునాట ఎవరైనా సరే చిన్న పిల్లలకు, పెద్దలకు కథ చెప్పేటప్పుడు 'అనగనగ..' అని మొదలుపెడతారు. చిన్న పిల్లల్లో కథ అనగానే ముందుగా కథ వినాలనే ఉత్సాహం ఉంటుంది. కానీ, ప్రశ్నించే తత్వం ఉం డదు. ఏది నిజం, ఏది అబద్ధం అనే ఆలోచనా జ్ఞానం ఉండదు. కల్పనా ప్రపంచంలో విహరించాలి అంతే. కొందరికి కథ కునుకు పట్టిస్తుంది కానీ, ఇది నిజం, ఇది అబ ద్ధం అనే ఆలోచనలను పెంచదు. కథ ల్లోని వాస్తవ, అవాస్తవాలను పక్కకు నెట్టేసి మనసును దేవుని మీదికి పోయేటట్టు చేస్తాయి గుడిలోని హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథల వంటి కథలు. ఇక బడిలోని కథల గురించి చెప్పాలంటే.. అవి మంచిని, మానవత్వాన్ని, నీతిని, పెద్దల ఆదర్శాలను, చదువును సంస్కారాన్ని, సృజనాత్మకతను, సశాస్త్రీయ పథాన్ని తెలియజేసేవిగా ఉంటాయా? ఉన్నాయా? ఉండాలా? అంటే సమాధానం ఉండాలనే ఎక్కువగా వస్తుంది. నేడు సినిమా కథలే ఎక్కువగా కోట్ల వ్యాపారాల నడుమ ప్రకాశిస్తున్నాయి. కొందరు సినిమా కథలో ఏదో ఒక నీతి ఉండాలి, లేదా సమాజానికి ఉపయోగపడే ఏదో ఒక సందేశం ఉం డాలంటున్నారు. అయితే మాట ఒకరకంగా ఉంటుంది. చేత మరొకరకంగా ఉంటుంది. సహజంగా ఉపాధ్యాయులు గానీ, పెద్దలు గానీ, పిల్లలు కానీ కథ మొదలు పెట్టేటప్పుడు 'అనగన గా..' అని అంటారు. అనగనగా అంటే ఏమిటంటే పూర్వం, చాలాకాలం కిందట వంటి అర్థాలను చెప్తా రు. ఇంగ్లీష్‌లో కూడా కథ మొదలు పెట్టేటప్పుడు అని అంటారు. అది 'అనగనగా' కు ఆంగ్ల రూపం అనే చెప్పవచ్చు. నిజానికి కథ మొదలు పెట్టేటప్పుడు ముందుగా అనవలసింది 'అనగనగా?' అని కాదు, 'అనఘనఘ' అని అనాలి. వాడుకలో మహా ప్రాణాక్షరం ఘ..గ..గ మారిపోయి అనగనగా అయ్యింది. దానికి చాలాకాలం కిందట అనే అర్థం ఊహించి చెప్పబడింది. నిజానికి అనగనగా అంటే పదబంధం ప్రకారం చెప్పగ చెప్పగ అనే అర్థాన్ని చెప్పాలి. కానీ అలా చెప్ప డం లేదు. నిజానికి అఘం అంటే పాపం అని అర్థం. అనఘం అంటే పాపం కానిది పుణ్యం అని అర్థం. అనఘ అంటే ఓ పుణ్యాత్ముడని అర్థం. అనఘనఘ అంటే ఓ ఓ పుణ్యాత్ముల్లారా అని అర్థం. హరికథలు, బుర్రకథలు వంటివి చెప్పేటప్పుడు మాన్యులు, మహనీయులు, మహానుభావులు, పుణ్యాత్ములని సంబోధిస్తుంటారు. అలాగే కథ చెప్పేటప్పుడు కూడా 'ఓ ఓ పుణ్యాత్ముల్లారా' అని కథ చెప్పేవారు వినేవారిని సం బోధిస్తారు. ఆ ఉద్దేశంతోనే అనఘనఘ అనే పదబంధాన్ని పూర్వం సృష్టించారు. కానీ, ఉచ్ఛారణ ఆ పద బంధ అర్థానికే ప్రమాదం తెచ్చింది. ఎందరెందరో మహానుభావులు కథలు రాశారు, చెప్పారు. మంచి పేరు తెచ్చుకున్నారు. కథలు చెప్పేది పెద్దలు, వినేది పిల్లలు అంతే అనే దృష్టితో 'అనఘనఘ'ని 'అనగనగ' చేసి 'లాంగ్ లాంగ్ ఎగో' అని ఆంగ్ల భాషా పండితుల చేత కూడా మన పండితులు అనిపించేశారు. హరికథలు, బుర్రకథలు చెప్పేవారు ఇప్పటికీ వినేవారిలో చిన్నారులున్నా, పెద్దలున్నా, ఎవరున్నా మాన్యులు మహనీయులు, మహానుభావులు, పుణ్యాత్ములు అనే పదాలనే ప్రయోగిస్తుంటారు. కథ చెప్పేటప్పుడు కూ డా అనఘనఘ అనే కథ ప్రారంభించాలి. అంటే ఓ ఓ పుణ్యాత్ముల్లారా అని కథ వినేవారిని సంబోధించడం. తెలుగు సాహిత్యం లో మంచి మంచి అర్థాలతో ఇలాంటి పద ప్రయోగాలు కొన్ని ఉన్నాయి. వాటి అర్థం తెలుసుకొని ప్రయోగిస్తే మనం చెప్పే విష యం మహా అర్థవంతంగా ఉంటుంది.

# అతడి పాట కన్నీటి ఊట



ఆ పాట విన్నవారెవరైనా కంటి నుంచి నీళ్లు తీయకుండా ఉండలేరు. ఆ వాగ్గేయకారుడు రాసి, పాడిన పాటలు విన్న విద్యాశాఖాధికారులు రాష్ట్రంలోని రెండు లక్షల బాల కార్మికులను బడిలో చేర్పించారు. అంతెందుకు ఆ పాట విన్న ప్రభుత్వం సైతం రాష్ట్రంలో అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు కృషిచేసింది. ఆ రచయితే చింతల యాదగిరి. ఆయన పాడిన పాటే 'నా చిట్టీ చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో/ నా సంకల మేడితో సాలిరువాలు దున్నినానయ్యో'. చింతల యాదగిరి నల్లగొండ జిల్లా, మేళ్ల దుప్పలపల్లి అనే పల్లెటూరుకు చెందినవాడు. 7వ తరగతిలోనే డ్రాపౌట్ అయి ఎడ్లగాసి, నాగలి దున్ని తన బాల్యాన్ని వ్యవసాయానికి ఎరువుగా మార్చా డు. బహుశా ప్రజానాట్య మండలిలో పని చేసినందుకేనే మో 'నా చిట్టీ చేతులు' పాట చింతల యాదగిరి రాశాడని ఎక్కువగా తెలియదు. ఆయన తెలియకున్నా ఈ సమా జం ఆయన పాటలను విన్నది, పాడుకున్నది. ఆయన రాసి పాడిన మచ్చుకు కొన్ని పాటలను పరిశీలిద్దాం. 'గుండెలోన రగిలిన బాధ కన్నీరై కారుతుంది/ కష్టానికి కారకులెవరో తెలుపమని కోరుతుంది' అంటూ యాదగిరి కంటికి కనిపించని బాధకు రూపంగా, కన్నీటిని వస్తుగతంగా మనకు చూపెడుతున్నాడు. అందుకే యూట్యూబ్‌లో ఉన్న ఈ పాటకు పది మిలియన్లకు పైగా వ్యూస్ కనిపిస్తున్నాయి. మొదటి లైన్లలోనే పదునైన పద ప్రయోగం, పాట మొత్తం భావాన్ని ఒక్క పల్లవిలో కూర్చి శ్రోతలను తనవైపునకు తిప్పుకోవడంలో యాదగిరి దిట్ట. 'ఉన్న ఊరు కన్న తల్లిని వదిలి పోలేనే/ నేల తల్లి పొదుగును కాదని చెదిరీ పోలేనే' అని సరళంగా, సూటి గా, ఒక బలమైన స్టేట్‌మెంట్‌తో పాటను ప్రారంభించిన యాదగిరి మనల్ని ఆ పాటలోకి ఆకర్షిస్తాడు. మనకు తెలియకుండానే మనల్ని సమరానికి సన్నద్ధం చేస్తాడు. అంతెందుకు 'అన్నదాత ఆగమవుతుండే/ పురుగుమందుతో ప్రాణాలొదిలిండే/ మట్టిబిడ్డడు మాయమవుతుండే/ మనలనిడిసీ వెళ్లిపోతుండే/ కనికరించని కాలం తోడు/ కాటువేసిన పాలన చూడు' అని యాదగిరి విలపిస్తూ రైతు ఆత్మహత్యలపై పాడిన పాట విన్నవారెవ్వరైనా సరే ఏడవకుండా ఉండలేరు. నిజానికి చాలామంది కవులు కరువుకు కాలాన్ని, ప్రకృతిని కారణంగా చూపిస్తారు. కానీ యాదగిరి మాత్రం రైతులను ప్రభుత్వం కాటు వేసిందని, లేదంటే లోకానికి అన్నం పెట్టే రైతు ఆత్మహత్య చేసుకోడని చెప్తాడు. అంటే సమస్య పట్ల లోతైన అవగాహన ఒక ప్రజా, ఉద్యమ కవికి మాత్రమే ఉంటుందనే విషయం గమనార్హం. ఇలా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన మార్క్సిస్టు దృక్పథాన్ని యాదగిరికి అందించింది ప్రజానాట్యమండలియే. 'అమ్మ రొమ్ము పాలలోన ఫ్లోరీను జాడ/ అన్నమిచ్చె పంట మీద విషపు నీళ్ల నీడ/ పాకులాడే ప్రాయమందు పట్టుకుంది వెన్ను/ కీలు కీలు అరగదీసి సంపుతుంది నన్ను' అంటూ నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య మీద పాట రాసిన మొట్టమొదటి వాగ్గేయకారుడు చింతల యాదగిరి. దీని విష ప్రభావం నల్లగొండ జిల్లా నీళ్లలో ఎంత దారుణంగా ఉన్నదో పై చరణంలో మనకు తెలుస్తుంది. ఇలా చింతల యాదగిరి వందల పాటలు రాశాడు. ఆయన రాసిన కొన్ని పాటలతో 'తీగో నాగో ఎన్నియ్యలో' అనే పుస్తకాన్ని మట్టిముద్రణలు, అలగడప వారు ముద్రించారు. మూడు దశాబ్దాలుగా పాటల వ్యవసాయం చేస్తున్న చింతల యాదగిరికి నడుస్తున్న తెలంగాణ వాగ్గేయ చరితలో ప్రామాణికమైన పాటకవిగా, ప్రజాకవిగా, వాగ్గేయకారుడిగా కావాల్సిన ప్రచారం, గుర్తింపు దక్కలేదు. తెలంగాణ నేల గర్వించదగిన గొప్ప కవిగాయకుడు చింతల యాదగిరి. నిజానికి చింతల యాదగిరి పాటంటే ఆనందం కాదు, ఆవేదనల మూట. తన్మయత్వం కాదు, తనువు అణువణువులో చెలరేగే ఆవేశం. తన స్వరం నిప్పురవ్వలను వెదజల్లే ఎర్రని కొలిమి. ఆ మండే గొంతులోంచి తన్నుకొచ్చే జీర సముద్రపు అలల హోరును, తుఫాను గాలి జోరును గుర్తుచేస్తూ పాడుతుంది. ఆయన కలంతో పొడిచే పొద్దుపై సంతకం చేస్తూ.. కాలం నుదుటన మరిన్ని పదునైన పాటలు రాయాలని ఆశిద్దాం. (వాగ్గేయకారుడు చింతల యాదగిరి 2024, డిసెంబర్ 15న ఢిల్లీ వేదికగా బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సందర్భంగా..)

# ఉదయం లేవగానే మడమలు నొప్పిగా ఉంటున్నాయా అయితే ఇలా చేయండి

చాలా మందికి ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలి మడమలు లేదా పాదాలు నొప్పిగా ఉంటాయి. కొందరికి ఈ నొప్పులు చలికాలంలో ఇంకా ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ నొప్పులు వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కానీ పలు సూచనలు పాటిస్తే ఈ నొప్పులను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. ఇందుకు గాను ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. పలు సహజసిద్ధమైన పద్ధతుల్లోనే కాలి మడమలు లేదా పాదాల నొప్పులను తగ్గించుకోవచ్చు. అందుకు పాటించాల్సిన సూచనలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. పాదాలు లేదా మడమల నొప్పి వచ్చేందుకు ఒక ప్రధాన కారణం ఉంటుంది. అదేమిటంటే.. కాలి వేళ్లను, మడమలను కలిపే కణజాలం ఒత్తిడికి గురైనా లేదా ఎక్కువగా సాగినా కూడా ఈ నొప్పి అనేది వస్తుంది.

### అనేక కారణాలు..

పాదాలపై పదే పదే ఒత్తిడిని కలగజేస్తే ఈ విధంగా కణజాలం సాగే అవకాశాలు ఉంటాయి. అలాగే ఎక్కువ సేపు నిలబడడం, మరీ ఎక్కువగా వాకింగ్ లేదా రన్నింగ్, జాగింగ్ వంటివి చేయడం, సరైన షూస్ లేదా చెప్పులను ధరించకపోవడం వల్ల పాదాలపై, మడమలపై ఒత్తిడి పడుతుంది. దీంతో అక్కడ ఉండే కణజాలం వాపులకు గురవుతుంది. సాగుతుంది. దీని వల్ల పాదాలు లేదా మడమల్లో నొప్పులు వస్తాయి. అలాగే హై హీల్స్ ఉన్న చెప్పులను ధరించడం, అధిక బరువు ఉండడం వల్ల కూడా ఈ నొప్పులు వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి.

### విశ్రాంతి అవసరం..

అయితే ఈ నొప్పులు ఉన్నవారు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. పాదాలు లేదా మడమల నొప్పులు పూర్తిగా తగ్గే వరకు విశ్రాంతి అవసరం. లేదంటే సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. దీంతో నొప్పులు మరీ ఎక్కువవుతాయి. అప్పుడు మరీ ఇబ్బందిగా ఉంటుంది. నడవడం కూడా కష్టంగా ఉంటుంది. కనుక ఈ తరహా నొప్పులు ఉన్నవారు కచ్చితంగా విశ్రాంతి తీసుకోవాలి. పాదాలకు విశ్రాంతిని ఇవ్వాలి. తేలికపాటి నడక అయినా సరే వద్దు. అలా చేయడం కూడా మంచిది కాదు. పూర్తిగా విశ్రాంతిని ఇవ్వాలి. దీంతో త్వరగా నొప్పుల నుంచి కోలుకునే అవకాశం ఉంటుంది.

### ఆవనూనెతో మసాజ్..

మార్కెట్‌లో పాదాలను సున్నితంగా ఉంచే పాదరక్షలు లేదా షూస్ లభిస్తున్నాయి. వాటిని ధరించాలి. దీంతో పాదాలపై భారం పడకుండా ఆపవచ్చు. దీని వల్ల కూడా నొప్పులు తగ్గుతాయి. అలాగే కాస్త ఆవనూనెను వేడి చేసి రాత్రి పూట పాదాలకు మర్దనా చేయాలి. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది. మరుసటి రోజు ఉదయం వరకు నొప్పులు తగ్గిపోతాయి. ఇలా పూర్తిగా కోలుకునే వరకు చేయాలి. నొప్పులను తగ్గించడంలో ఆవనూనె ఎంతగానో పనిచేస్తుంది. పాదాలు సాగేలా చేసే వ్యాయామాలు లేదా యోగా చేయాలి. దీని వల్ల కూడా ఫలితం ఉంటుంది. ఈ తరహా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా పలు సూచనలను పాటించడం వల్ల పాదాలు లేదా మడమల నొప్పులను సులభంగా తగ్గించుకోవచ్చు.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శుక్రవారం 28 - 02 - 2025

# అర్థ రహితం దోష భరితం




సోషల్ మీడియాలో పూటకో కొత్త రూపు సంతరించుకుంటున్నా, ఓటీటీ సంచనాలు సృష్టిస్తున్నా.. స్మార్ట్ దునియాలో ఇప్పటికైతే యూట్యూబ్‌దే హవా! గిగాబైట్ల కొద్దీ ఎంటర్‌టైన్మెంట్ పంచుతున్న యూట్యూబ్ అడ్డాగా బాగుపడ్డవాళ్లు ఎందరో! కానీ, ఇదే యూట్యూబ్ వేదికగా విశృంఖల, విపరీత పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారు కొందరు. ఘనాపాఠిని ఇంటర్వ్యూ చేసినా, మేటి నటిని పలకరించినా, గాన కోకిలతో ముచ్చటించినా.. వాళ్లు చెప్పే సంగతుల్లోని అసలు విషయాన్ని పక్కదారి పట్టించే మాయదారి థంబ్‌నెయిల్స్ పెడుతూ పబ్బం గడుపుకొంటున్నారు. అదేమిటంటే.. నెగెటివ్ థంబ్ నెయిల్స్ పెడితే హిట్లు ఎక్కువగా వస్తాయని వ్యాఖ్యానిస్తున్నారు. దశాబ్దాలపాటు తెలుగువారిని అలరించిన ఓ ప్రముఖ గాయనిని మరో విశిష్ఠ యాంకర్ ఇంటర్వ్యూ చేసింది. అందులో చాలా విషయాలు చర్చకు వచ్చాయి. ఆ ఇంటర్వ్యూను ముక్కలు ముక్కలుగా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. ఒక్కోదానికీ ఒక్కో చెత్త థంబ్ నెయిల్ పెట్టారు. వీటిలో జాతిరత్నం 'అసహ్యమైన పాటలు పాడించేవాడు' అన్నది. తీరా వీడియోలోకి వెళ్తే అన్నీ మంచి విషయాలే! యాంకర్ అడిగే ప్రతి ప్రశ్నకూ.. ఆ గాయని హుందాగా, సహేతుకంగా సమాధానం చెప్పింది. 'పిల్లలకు పాడాను, అబ్బాయి గొంతులా పాడాను, కొన్నిసార్లు చాలా అసహ్యంగా పాడాల్సిన పాటలూ ఉంటాయి. ఇళయరాజాకు ఎన్ని రకరాల వెరైటీలు పాడాను నేను' అని చెప్పుకొచ్చింది. ఈ వీడియోకు 'అసహ్యమైన పాటలు పాడించేవాడు' అని థంబ్ నెయిల్ తగిలించి, ఇళయరాజా చిత్తరువును ఇన్‌సర్ట్ చేశారు. అక్కడ ఆమె అన్నదేంటి? వీళ్లు పెట్టిదేంటి? పాట ఉన్నంత కాలం చెరగని కీర్తి మూటగట్టుకున్న ఆ మహాగాయని ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందన్న ఇంగితం కూడా లేకుండా నీచమైన థంబ్‌నెయిల్ పెట్టి పైశాచిక ఆనందం పొందడం ఎందుకో అర్థం కాదు! మరో థంబ్‌నెయిల్ 'ఇళయరాజాకి నేను పాడాను అంటే వచ్చి గొడవ చేసేవారు' అని ఉంది. ఆ యూట్యూబర్ భావన 'పాడను' అంటే.. కానీ, తప్పును కూడా పద్ధతిగా చేయలేని దుస్థితిలో ఉండటం గర్హనీయం. ప్రముఖ గాయని ఇంటర్వ్యూలోనే ఇన్ని అర్థరహితాలు, దోషభరితాలు ఉంటే%ా% ఓ మోస్తరు కళాకారుల విషయంలో ఇంకెంతటి వైపరీత్యాలు ప్రదర్శిస్తున్నారో ఊహించుకోవచ్చు.

# కరెంట్ మీటర్



మనుషులను శుభ్రం చేసే వాషింగ్ మెషీన్ ఇటీవల వార్తల్లో నిలిచింది. దీనిని రూపొందించిన సంస్థ ఏది? ప్రపంచంలోనే అరుదుగా కనిపించే ఓ పక్షి.. మహబూబాబాద్ జిల్లాలోని భీమునిపాదం జలపాతం దగ్గర ఓ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కెమెరాకు చిక్కింది. ఆ పక్షి పేరేంటి? శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో విహరించే 'షికారా' చెక్క పడవలను తమ యాప్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించిన సంస్థ ఏది? హైదరాబాద్ చరిత్రలో అంతర్భాగమైన ఓ భవనం.. జాతీయ స్థాయి మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో 'ట్రేడ్‌మార్క్' పొందనున్నది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఈ ఘనత సాధించనున్న ఆ భవనం ఏది? రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్లినిక్‌ల పేరేంటి? సూర్యుడి వెలుపలి వలయమైన 'కరోనా'పై లోతైన పరిశోధనలు చేయడానికి ఐరోపా అంతరిక్ష సంస్థ ఇటీవల ఓ వినూత్న ప్రయోగం చేపట్టింది. ఆ ప్రయోగాన్ని ఏమని పిలుస్తున్నారు? సైబర్ నేరగాళ్లు తెరుస్తున్న 'మ్యూల్ అకౌంట్స్'ను ఏరివేయడమే లక్ష్యంగా ఆర్బీఐ ఆవిష్కరించిన ఏఐ మోడల్ ఏది? భోపాల్ నగరాన్ని మృత్యుదిబ్బగా మార్చిన 'గ్యాస్ దుర్ఘటన'కు ఇటీవలే 40 ఏళ్లు పూర్తయాయి. ఏ కర్మాగారం నుంచి గ్యాస్ లీకై.. వేల మంది మరణాలకు కారణమైంది? టీ20ల్లో 40 బంతుల్లోపు రెండు శతకాలు సాధించిన తొలి ఆటగాడిగా తాజాగా రికార్డు సృష్టించిన యువ క్రికెటర్ ఎవరు? భారత అమ్ముల పొదిలోకి ఓ సరికొత్త అస్త్రం వచ్చి చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆ అధునాతన సెల్ఫ్ డిస్ట్రాయ్ డ్రోన్ ఏది?

## బరువు తగ్గాలని అనుకుంటున్నారా
# అయితే ఈ తప్పులు అస్సలు చేయొద్దు



నేటితరం మహిళల్ని వేధిస్తున్న అతిపెద్ద సమస్య.. అధిక బరువు. దీనివెంటే.. కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలూ పలకరిస్తాయి. కాబట్టి, ఎలాగైనా బరువు తగ్గాల్సిందేనని కంకణం కట్టుకుంటారు. ఇక యువతులైతే నాజూగ్గా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటారు. అలా.. 'బరువు'ను కంట్రోల్ చేసేందుకు 'స్ట్రిక్ట్ డైట్' పాటిస్తుంటారు. ప్రతిరోజూ రకరకాల వ్యాయామాలు చేస్తుంటారు. అయినా.. కొందరుమాత్రం బొద్దుగానే కనిపిస్తుంటారు. ఒళ్లు హూనమయ్యేలా వర్కవుట్స్ చేస్తున్నా.. నోరు కట్టేసుకుని హెల్తీ డైట్ పాటిస్తున్నా.. బరువెందుకు తగ్గడం లేదని బాధ పడుతుంటారు. అయితే, వారికి తెలియకుండానే చేసే కొన్ని తప్పులు.. బరువు తగ్గకుండా చేస్తాయని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. వాటిని గుర్తించి, పునరావృతం కాకుండా చూసుకుంటే.. 'బరువు'ను నియంత్రణలో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు. బరువు తగ్గేందుకు భారీ వ్యాయామాలు చేయవద్దనీ, అలా చేయడం వల్ల కండరాలు మరింత బలాన్ని పొందుతాయని చెబుతున్నారు. ఎక్కువ ఒత్తిడికి గురైనా బరువు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఇక రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం, అందులోనూ కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా బరువు పెరగడానికి కారణం అవుతాయి. ఇక మహిళల్లో అంతర్లీనంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వారి బరువును ప్రభావితం చేస్తాయని నిపుణుల మాట. ముఖ్యంగా.. ఆడవాళ్లలో హార్మోన్ల అసమతుల్యత వల్ల జీవక్రియలు నెమ్మదించి, బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక పీసీఓడీ, పీసీఓఎస్ సమస్యలు కూడా బరువును పెంచేవే! మెనోపాజ్ సమయంలోనూ కొందరు బరువు పెరుగుతుంటారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనేవారు.. బరువును నియంత్రణలో ఉంచుకోవడం కొంచెం కష్టమే! నిద్రలేమి కూడా బరువు పెరగడానికి ఓ కారణం! రాత్రిపూట ఆరుగంటల కన్నా తక్కువ నిద్రపోయే వారి శరీరంలో.. కొవ్వు ఎక్కువగా పెరిగిపోతుందట. నిద్రలేమి వల్ల శరీరంలో కార్టిసోల్, ఇన్సులిన్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయనీ, ఇవి శరీర బరువు పెరిగేలా చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలను ఫాలో అయితే.. బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

# ప్రతీకారమే కాంగ్రెస్ రాజకీయం



కక్ష, కార్పణ్యాలు చొరబడితే పగ, ప్రతీకారాలతో రాజకీయాలు రగిలిపోతాయని నడుస్తున్న చరిత్ర చెప్తున్నది. అధికారమిచ్చిన ప్రజల కోసం కాకుండా పాలానా కాలమంతా కేసులు, జైళ్లు, ప్రతీకారంపైనే దృష్టిసారించిన రాజ్యాలేవీ నాటి నుంచి నేటి వరకూ మనుగడ సాగించిన దాఖలాలు చరిత్రలో లేవు. రాజ్యాలు మారినా, రాజులు పోయినా నాటి రాజకీయాలే నడుస్తుండటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా పరిణమిస్తున్నది. ఇవాళ రాజకీయ పార్టీలు చట్టాలను దుర్వినియోగం చేస్తూ తమ రాజకీయ శత్రువులపై వాటిని ప్రయోగించడం దేశ రాజకీయాల్లో సాధారణ విషయంగా మారడం రాజ్యాంగానికి ప్రమాదకరం. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని పోలీసులు, పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు, మంచి బువ్వ కోసం హాస్టళ్ల విద్యార్థులు, రైతుబంధు, రుణమాఫీ కోసం రైతన్నలు, వేతనాల కోసం ఆశావర్కర్లు, ఆటోడ్రైవర్లు, హైడ్రా, మూసీ బాధితులు, లగచర్ల, దిలావర్‌పూర్ రైతాంగం.. ఇలా చెప్పుకొంటూపోతే కాంగ్రెస్ ఏడాది పాలనలో రోడ్డెక్కని వర్గమే లేదు. నిరసన తెలపని బాధితులూ లేరు. తెలంగాణలో ప్రజాపాలన కాస్త ప్రతీకార పాలనగా మారిందన్నది సుస్పష్టం. అధికారమే శాశ్వతమని, సింహాసనం తమ సొంతమని భావిస్తూ కాంగ్రెస్ సర్కారు, ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న ఆవేశపూరిత, ప్రతీకారేచ్ఛ నిర్ణయాలపై తెలంగాణ సమాజం లోతుగా అధ్యయనం చేస్తున్నది. అసాధ్యమనుకున్న స్వరాష్ట్రం కలను సుసాధ్యం చేసిన తెలంగాణ జాతిపిత, ఉద్యమ కెరటం కేసీఆర్‌పై, బీఆర్ఎస్ పార్టీపై, నాయకత్వంపై సాగుతున్న కుట్ర కోణం అంతా ఇంతా కాదు. బీఆర్ఎస్ అనే మొక్కనే మొలవనివ్వనని బహిరంగంగా తన కసిని, కోపాన్ని వెళ్లగక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ పాలన కంటే కేసులపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. 14 ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, పదేండ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవలందించిన కేసీఆర్‌ను కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టాలన్నది ముఖ్యమంత్రి ఉవాచ అని స్పష్టమవుతున్నది. అంతెందుకు తన పేరు ఉచ్చరించలేదనే కారణంతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను జైల్లో పెట్టి వికృతానందం పొందిన రేవంత్ ఆటిట్యూడ్‌ను ఇవాళ తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తున్నది. కేసీఆర్‌పై రేవంత్ ప్రతీకారం వెనుక ఓటుకు నోటు కేసు ఉన్నదనే విషయం స్పష్టంగా తెలుస్తున్నది. కొత్తగా తెచ్చుకున్న రాష్ట్రాన్ని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రల్లో భాగంగా చంద్రబాబుతో చేతులు కలిపి అడ్డంగా దొరకడంతో నాటి ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకున్నది. ఆ కారణంగానే ఇప్పుడు కేసీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్ ఉబలాటపడుతున్నారు. అందులో భాగంగానే కాళేశ్వరం కమిషన్, విద్యుత్ కొనుగోళ్ల నివేదిక తదితర అంశాల ఆధారంగా చర్యలుంటాయని లీకులిస్తున్నారు. కాళేశ్వరంతో తెలంగాణ ఎలా సస్యశ్యామలమైనదో ప్రపంచానికి తెలుసు. కారుచీకట్లో ఉన్న తెలంగాణను కరెంట్ వెలుగులతో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చిన ఘనత కూడా కేసీఆర్‌దే. ఈ రాష్ట్ర రైతాంగానికి పొలం నిండా నీళ్లు.. కల్లం నిండా కరెంట్ ఇచ్చిన పాపానికి కేసీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్ ఆరాటపడుతున్నట్టు తాజా క్యాబినెట్ భేటీతో రూఢీ అయింది. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంటిపై డ్రోన్లు ఎగురవేసి, ఆయన ప్రైవసీకి భంగం కలిగించి, కుట్రకు పాల్పడిన రేవంత్‌పై నాటి సర్కారు చర్యలు తీసుకుంది. దాన్ని మనసులో పెట్టుకున్న ఆయన ప్రతీకారంతో అధికారంలోకి రాకముందే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తానని, జైలులో డబుల్ బెడ్రూం కట్టిస్తానని పదే పదే చెప్పారు. రేవంత్ మాటలను బట్టి ఆయన గమనం ఎటుపోతున్నదో అవగతమవుతున్నది. అందుకోసమే ఈ- కార్ రేసింగ్, ఇతరత్రా అంశాలను కేటీఆర్ చుట్టూ తిప్పుతున్నారు. ఏడాదిలోనే కేటీఆర్‌పై 10 కేసులను నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధం లేని కేసుల్లో ఇరికించి జైలుకు పంపించాలన్నది రేవంత్ కుట్రగా అందరికీ తెలుస్తున్నది. ఇక ఎలాంటి ఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును ఇరికించి, జైలుపాలు చేయాలని రేవంత్ ఉవ్విళ్లూరుతున్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌ను రాజకీయంగా ఖతం చేసేందుకు రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ చేయని ప్రయత్నమే లేదు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలించే వ్యూహంతోనే రేవంత్ పాలన సాగుతున్నది. కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసి కట్టడి చేయడం ఎట్లనో ఇటీవల క్యాబినెట్‌లో భేటీలో మంత్రివర్గ సభ్యులకు సీఎం రేవంత్ హితబోధ చేసిన తీరు, త్వరలో పొలిటికల్ బాంబులు పేలుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదేపదే పునరుద్ఘాటిస్తున్న వైనం, కోమటిరెడ్డి సహా మిగతా మంత్రులు వంతపాడుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. ప్రజల్లోంచి పుట్టిన ఉద్యమ పార్టీని కేసులతో, జైళ్లతో బెదిరించగలరా? జన బాహుళ్యం నుంచి వచ్చే నిరసనలను చవిచూడగలరా? ఏడాదిలోనే నూరు శాతం వ్యతిరేకతను మూటగట్టుకున్న రేవంత్ సర్కారు ప్రతీ వర్గం నుంచి ఆందోళనలను ఎదుర్కొంటున్నది. ప్రజల కోసం, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచించాల్సింది పోయి ఇవాళ ప్రతిపక్ష పార్టీని ఖతం చేయాలన్న దురుద్దేశంతో ముందుకు పోతున్నది. ఈ వైఖరి రేవంత్ సర్కార్‌కు పెనుశాపంలా మారుతుంది. అరచేతిని అడ్డుపెట్టుకొని సూర్యకాంతిని ఎవరూ ఆపలేరనే నగ్నసత్యాన్ని పాలకులు గ్రహించాలి. అలాగే ఉద్యమ దివిటీలను ముట్టుకుంటే మరో ఉప్పెన వస్తుందని తెలుసుకుని మసులుకుంటే మంచిది.

# భోజనం చేసిన వెంటనే సోంపు తింటే ఇన్ని ప్రయోజనాలా తెలిస్తే వెంటనే మొదలు పెడతారు

భోజనం చేసిన అనంతరం చాలా మంది రకరకాల ఆహారాలను తింటుంటారు. లేదా జ్యూస్‌లు, ఇతర డ్రింక్స్‌ను సేవిస్తుంటారు. భోజనం చేశాక కొందరు టీ, కాఫీ తాగుతారు. అయితే వాస్తవానికి భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను తింటుండాలి. మన పెద్దలు భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను నోట్లో వేసుకుని నమిలే వారు. అందుకనే వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. కానీ మనం అలా చేయడం లేదు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను నమలడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సైతం చెబుతున్నారు. మనకు కలిగే అనారోగ్య సమస్యలను నయం చేయడంలో సోంపు గింజలు ఎంతగానో పనిచేస్తాయి. భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను గుప్పెడు తీసుకుని నమిలితే ఎన్నో లాభాలను పొందవచ్చు.

### జీర్ణ వ్యవస్థ పనితీరుకు..

సోంపు గింజల్లో అనేక పోషకాలు ఉంటాయి. పోషకాలకు వీటిని గనిగా చెప్పవచ్చు. ఈ గింజల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం, మెగ్నిషియం సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ గింజలను తింటే మనకు పోషణ లభిస్తుంది. ఈ పోషకాలు మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఈ గింజల్లో అనెథోల్ ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లను ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, అసిడిటీ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.



### నోటి దుర్వాసన తగ్గుతుంది..

సోంపు గింజల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ గింజలను నోట్లో వేసుకుని నమిలితే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోరు శుభ్రమవుతుంది. నోటి దుర్వాసన నుంచి విముక్తి లభిస్తుంది. కనుకనే భోజనం చేసిన అనంతరం నోరు శుభ్రంగా ఉండేందుకు మన పెద్దలు అప్పట్లో సోంపు గింజలను నమిలే వారు. అలాగే ఈ గింజలను నమిలితే ఫైబర్, మినరల్స్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీర మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా శరీరంలో ఉండు కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్న వారు భోజనం చేసిన అనంతరం రోజూ సోంపును తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.

### బీపీ కంట్రోల్ అవుతుంది..

సోంపు గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, క్వర్సెటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఈ గింజల్లో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఉంటాయి. అలాగే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. కాబట్టి భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను తినడం అలవాటు చేసుకోవాలి. అలాగే ఈ గింజల్లో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారికి సోంపు గింజలు ఒక వరమనే చెప్పవచ్చు. వీటిని రోజూ తింటుంటే బీపీని కంట్రోల్ చేయవచ్చు. ఇలా భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను నమలడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

## వర్చ్యువల్ భ్రాంతి
# వాస్తవానికి అశాంతి

లైక్‌లే నిజాలు అనుకుంటున్నారా? కామెంట్లే కొలమానాలుగా భావిస్తున్నారా? రోజుకో డీపీ మార్చుకుంటూ%ా% వర్చ్యువల్ ఇమేజ్‌ను పెంచుకుంటూ పోతున్నారా? ఇలాంటి లక్షణాలు ఉన్నాయంటే.. మీరు బిల్డప్ బుల్లెమ్మలే! డిజిటల్ చట్రంలో ఇరుక్కుపోతే ఎప్పుడో ఫేక్ అయిపోతారు జాగ్రత్త!! ఈ తరం యువతీయువకుల్లో ఈ ఫేక్ ఐడెంటిటీ భావన వారికి తెలియకుండానే ముదిరిపోతున్నదట! లేనివి ఉన్నట్టుగా ఊహించుకుంటూ, తమ వాస్తవ పరిస్థితిని అసహ్యించుకునే స్థాయికి వెళ్లిపోతున్నారట. వర్చ్యువల్ లైఫ్, రియల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయలేక మనోవ్యథకు గురువుతున్నారట!! శ్రావ్య కాస్త బొద్దుగా ఉంటుంది. ముద్దుగానే ఉంటుంది. కానీ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో మాత్రం స్లిమ్‌గా, హాట్‌గా కనిపించే పిక్‌లు పెడుతుంది. వాటికొచ్చే లైక్‌లు, కామెంట్లు చూసుకొని మురిసిపోతుంది. వర్చ్యువల్ ఇమేజ్ కోసం సోషల్ మీడియాలో తెగ యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, నిజమేంటో ఆమెకు తెలుసు. ఆ నిజం ఆమెను ఒత్తిడికి గురిచేస్తున్నది!! విశాల్ మధ్యతరగతి అబ్బాయి. ఒకరోజు ఫ్రెండ్ బైక్ మీద టక్కస్టైల్‌గా రేబాన్ కళ్లజోడు పెట్టుకుని తీసుకున్న సెల్ఫీ ప్రొఫైల్ పిక్‌గా పెట్టాడు. ఏఐ ఎడిటింగ్స్‌తో సాదాసీదా బాడీకి ఫిట్‌నెస్ కూడా అద్దాడు. హీరోలా కనిపించేసరికి విపరీతంగా లైక్‌లు వచ్చిపడ్డాయి. అమాంతంగా వచ్చిన స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేయాలనుకున్నాడు. ఫ్రెండ్స్‌తో షాపింగ్ మాల్స్ చుట్టేస్తూ, కారులో విహరిస్తూ.. దిగిన ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ పోయాడు. ఫాలోవర్లూ పెరిగారు. కానీ, అతను పెట్టుకున్న కళ్లజోడు, తిరుగుతున్న కారు.. ఇవేవీ తనవి కావు. కానీ, సోషల్ మీడియాలో చూసేవారంతా విశాల్ రేంజ్ వేరని ఫిక్సయ్యారు. అంతేకాదు, తనని కూడా అలా ఫిక్సయ్యేలా భ్రమ కల్పించారు. కానీ, విశాల్ మనసులో ఏదో ఒక మూల తెలియని అశాంతి. దీంతో తను ఇష్టంగా తొక్కే సైకిల్‌తో సెల్ఫీ తీసుకోలేని పరిస్థితికి వచ్చేశాడు. వర్చ్యువల్ ప్రపంచంలో విహరిస్తున్న యువతీయువకులు కూడా అచ్చం శ్రావ్య, విశాల్ లాగానే ప్రవర్తిస్తున్నారు. ఫేక్ ఐడెంటిటీని మాస్క్‌లా తగిలించుకొని సోషల్ దునియాను దున్నేస్తున్నామని భావిస్తున్నారు. ముఖ్యంగా యువతులు ఈ డిజిటల్ అట్రాక్షన్స్‌కు ఎక్కువగా గురవుతున్నారని పలు సర్వేలు హెచ్చరిస్తున్నాయి. తమను తాము ఓ బ్రాండ్‌గా ప్రొజెక్ట్ చేసుకోవాలనే తపనే.. చాలామంది అమ్మాయిలను సోషల్ లైఫ్‌కు దగ్గర చేస్తున్నదని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవ ప్రపంచంలో ఒకలా, సోషల్ మీడియాలో మరొకలా వ్యవహరిస్తూ.. ఒక్కరిలోనే ఇద్దరు ఉంటున్నారు. మీలోనూ ఆ ఇద్దరు ఉన్నారా? సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలని చాలామంది ఆరాటం. బయట ఎలా ఉన్నా.. ఎఫ్‌బీ, ఇన్‌స్టాల్లో ఆదర్శభావాలను వల్లిస్తుంటారు. ఎక్కడో బ్రౌజింగ్‌లో కనిపించిన కొటేషన్లను స్టేటస్‌గా పెట్టేసి గొప్పగా ఫీలవుతారు. దాన్ని ఎంతమంది చూశారు, ఎవరెలా రెస్పాండ్ అయ్యారు అని తరచూ చెక్ చేసుకుంటూ ఉంటారు. నాలుగు లైక్‌లు రాగానే నెట్టింట్లో అందరూ తమనే ఫాలో అవుతున్నారని ఊహించుకుంటారు. కానీ నిజ జీవితానికి వచ్చేసరికి ఆ కొటేషన్‌లో చెప్పిన ఆదర్శభావాలు పాటిస్తున్నామా అన్న ప్రశ్న ఉదయించగానే మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. ఈ క్రమంలో డిజిటల్ ప్రపంచంలో సంపాదించుకున్న డమ్మీ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటారు కానీ, తమ రియల్ లైఫ్‌ను అంగీకరించలేరు.

### పరిధి దాటొద్దు

వాస్తవ ప్రపంచంలో అయినా.. సోషల్ వరల్డ్ లో అయినా.. స్థిమితంగా ఉండటం అవసరం. పదే పదే డీపీ మార్చేయడం, అదేపనిగా స్టేటస్ చెక్ చేయడం.. లాంటి వైఖరులు సోషల్‌లైఫ్‌లో మీరు స్థిరంగా లేరన్న దానికి సంకేతంగా భావించాలి. ఎవరిదో బెంజి కారు పార్క్ చేసి ఉంటే సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొందరు. దానికొచ్చే లైక్‌లు, కామెంట్లతో ఎంజాయ్ చేస్తారు. ఈ ఆర్భాటం మీ జీవితాన్ని అగాథంలోకి నెట్టే ప్రమాదం ఉంది. లేనిది ఉన్నట్టుగా చూపించాలనుకోవడం ప్రమాదకరం. వర్చ్యువల్ లైఫ్‌ను ఆస్వాదించడం మొదలైతే.. వాస్తవ జీవితంలోకి రావడానికి ధైర్యం సరిపోదు. ఎందుకంటే.. రకరకరాల ఫిల్టర్లు, కెమెరా ఆప్షన్లు వాడి మీ అసలు ముఖాన్ని చెరిపేశారు. మీ ఫాలోవర్లు మీ వాస్తవ రూపం చూడాలనుకుంటే మీరెలా స్పందిస్తారు? ఆ పరిస్థితే వస్తే ఫేస్ చేయగలరా? ఆ ఒత్తిడిని తట్టుకోగలరా? మీరో బ్రాండ్ అవ్వడం అంటే.. మీదైన ప్రత్యేకతను చాటుకోవాలి. అంతేకానీ, అరువు తెచ్చుకున్న అందాలను అద్దుకొని మురిసిపోవడం కాదు! మీకున్న టాలెంట్‌తో సోషల్ వేదికల్లో పరిచయమవ్వండి. నిజాయతీగా ప్రయత్నిస్తే ఎప్పటికైనా మీరు ఆశించిన సెలెబ్రిటీ హోదా దక్కుతుంది. మరో మాట పనివేళల్లో, ఆఫీస్ కంప్యూటర్స్‌లో సోషల్ మీడియా సర్వీసులను యాక్సెస్ చేయొద్దు. సామాజిక మాధ్యమాల్లో లైక్‌లే పరమావధిగా ఏది పడితే అది షేర్ చేయొద్దు. ఓ పరిధి మేరకే విషయాలను పంచుకోవాలన్న విషయాన్ని గ్రహించాలి. వర్చ్యువల్‌లో ధరించిన ఫేక్ ముసుగు.. రియల్ వరల్డ్‌లో మీ ఇమేజ్‌ని అమాంతం నేలకు దించేస్తుందని మర్చిపోవద్దు.

### ఎడిటింగ్ మాయ కొంత

సోషల్ మీడియా మయసభను మించిన మాయా ప్రపంచం! కృత్రిమ మేధకు దత్త సంతతిలా పుట్టుకొచ్చిన ఎడిటింగ్ ఫీచర్లు అస్త్రాలుగా చాలామంది రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారు. ఫేక్ పోస్టింగులు పెడుతున్నారు. లావుగా ఉన్నవాళ్లు మెరుపుతీగలా కనిపించేలా మాయ చేస్తున్నారు. బానపొట్టతో ఉన్న పురుషుడి ఫొటో ఏఐ సాయంతో సిక్స్‌ప్యాక్‌లోకి మారిపోతున్నది. వీటిని ఫాలో అయ్యేవారు ఆ క్షణం మురిసిపోయి లైక్ కొట్టి ఊరుకుంటారు. అక్కడితో వాళ్ల పాత్ర ముగిసిపోతుంది. ఆ లైక్‌ల ప్రభావంతో ఇమేజ్ చట్రంలో ఇరుక్కుపోతున్నారు కొందరు. అయితే ఈ ఫేక్ ఎన్నోరోజులు నిలబడదు. సోషల్ మీడియా అకౌంట్‌లో ఉన్న మీరు.. అసలైన మీరు కాదని ప్రపంచానికి తెలియకపోవచ్చు. కానీ, ఏదో ఒకరోజు.. 'అది నేను కాదు!' అన్న నిజాన్ని మీరు అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మనసు, మెదడూ రెండూ ప్రశ్నిస్తాయి. మీరు 'ఒక్కరా? ఇద్దరా?', 'నీ నిజ స్వరూపం ఏది?' అని. అప్పటికైనా వాస్తవం గుర్తించగలిగితే ఫర్వాలేదు. ఇంకా భ్రమల్లోనే ఉంటామంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకున్నట్టే!



## ఈసారి జీడీపీ 6.4 శాతమే.. భారత్ వృద్ధికి ఫిక్కీ కోతలు

### గతంలో 7 శాతంగా అంచనా




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉంటుందని పేర్కొనగా.. ఇప్పుడు అర శాతానికిపైగా కుదించడం గమనార్హం. ఇక 2023-24 దేశ జీడీపీ వృద్ధిరేటు 8.2 శాతం గా ఉన్నది. ఈ క్రమంలో తాజా అంచనా మరింతగా వృద్ధిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. గత నెల డిసెంబర్‌లో ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణుల నుంచి సేకరించిన స్పందనలు, అభిప్రాయాల ఆధారంగా ఈ సర్వేను ఫిక్కీ చేపట్టింది.

**ఒడిదొడుకులు**

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందన్న దానిపై నిపుణులు స్పందిస్తూ.. స్వల్ప కాలంలో ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు మందగించవచ్చన్నారు. ఇక అధిక సుంకాలు, వీసా నిబంధనలు కూడా కొంత ఇబ్బందికరమేనన్నారు. రూపాయి మారకం విలువ స్థిరత్వాన్ని కోల్పోవచ్చని చెప్తున్నారు. ఇదిలావుంటే వ్యవసాయోత్పత్తి పెంపు, మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల వ్యవస్థ బలోపేతం వంటివి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించగలవని సూచించారు.

## అంచనాలకుమించి రాణించిన ఇన్ఫోసిస్




దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 11.46 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ఐటీ సేవలకు డిమాండ్ ఊపందుకోవడం, వార్షిక విక్రయాల అంచనా మూడోసారి పెంచడం సంస్థకు కలిసొచ్చింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.6806 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.6,106 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధించింది. అలాగే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం అధికమై రూ.41,764 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో 4.5-5 శాతం వరకు పెరుగుదలవుండవచ్చునని గైడెన్స్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ..ఆర్థిక సేవలతోపాటు రిటైల్, కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ రంగంలో మార్పులు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, దీంతో ఈ ఏడాది ఆదాయ వృద్ధిలో అంచనాను సవరించినట్లు చెప్పారు. కంపెనీ మొత్తం ఆదాయంలో బీఎఫ్ఎస్ఐ నుంచి మూడోవంతు సమకూరుతున్నదని, అత్యధికంగా సమకూరుతున్న అమెరికాలో 6.1 శాతం వృద్ధిని కనబరిచినట్లు చెప్పారు. గత త్రైమాసికంలో 5,591 మంది ఉద్యోగులు జతయ్యారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,23,379కి చేరుకున్నారు. ప్రస్తుతేడాది 15 వేల మంది ఉద్యోగ నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని, వీరితోపాటు 20 వేల మంది ఫ్రెషర్లను సైతం తీసుకోబోతున్నది.


### లాభాల్లో ముగిసిన మార్కెట్లు

## సెన్సెక్స్ 318 పాయింట్లు జంప్




దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 77,319.50 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,895.51 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 77,319.50 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 318.74 పాయింట్లు పెరిగి.. 77,042.82 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.60 పెరిగి.. 23,311.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2669 షేర్లు లాభపడ్డాయి. మరో 1,132 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ పోర్ట్స్ ఉన్నాయి. ట్రెంట్, టాటా కన్స్యూమర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హెసీఎల్ టెక్, విప్రో నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.4 శాతం పెరిగింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, ఆటో 0.5 నుంచి 2.5 శాతం పెరిగాయి.

## మూడో రోజూ లాభాలే 77 వేల మార్క్ దాటిన సెన్సెక్స్




అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు మదుపర్లు కొనుగోళ్లపై దృష్టి పెట్టడంతో సూచీలు వరుస లాభాలను అందుకుంటున్నాయి. ఈ వారంలో తొలి రోజైన సోమవారం భారీ నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు మంగళవారం నుంచి లాభాల బాట పట్టాయి. ఈ రోజు (గురువారం) కూడా లాభాల్లోనే కదలాడాయి. ఇండెక్స్‌లో హెవీ వెయిట్ షేర్లు లాభపడుతుండడం సూచీలపై సానుకూల ప్రభావం చూపిస్తోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో సాగుతున్నాయి బుధవారం ముగింపు (76, 724)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 600 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. 77, 319 వద్ద గరిష్టానికి చేరుకుంది. ఆ తర్వాత కొద్దిగా దిగి వచ్చినప్పటికీ లాభాల్లోనే కొనసాగింది. చివరకు 318 పాయింట్ల లాభంతో 77, 042 వద్ద రోజును ముగించింది. మళ్లీ 77 వేల మార్క్‌ను దాటింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలతో రోజును ప్రారంభించింది. చివరకు 98 పాయింట్ల లాభంతో 23, 311 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఎల్ అండ్ టీ టెక్నాలజీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, ఇండియన్ బ్యాంక్ షేర్లు లాభాలు అందుకున్నాయి. ఒరాకిల్ ఫిన్‌సెర్వ్, కల్యాణ్ జువెల్లర్, ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 584 పాయింట్ల లాభం ఆర్జించింది. బ్యాంక్ నిఫ్టీ 527 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 86.55గా ఉంది.


# రిలయన్స్ లాభం 18,540 కోట్లు

# క్యూ3లో 7.4 శాతం పెరిగిన ప్రాఫిట్

దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు నికర లాభంలో 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. రిటైల్ వ్యాపారంతోపాటు టెలికం విభాగం అంచనాలకుమించి రాణించడం వల్లనే లాభాల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.18,540 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.13.70 చొప్పున ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.17,265 కోట్ల లాభం లేదా ప్రతిషేరుకు రూ.12.76తో పోలిస్తే సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.27 లక్షల కోట్ల నుంచి రూ.2.43 లక్షల కోట్లకు ఎగబాకింది. రూ.3.5 లక్షల కోట్లకు చేరుకున్న రుణాలకోసం సంస్థ అధికంగా చెల్లింపులు జరపడం వల్లనే లాభాలు భారీగా పుంజుకోలేకపోయాయని కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికం నాటికి కంపెనీకి రుణాలు రూ.3.36 లక్షల కోట్లు, ఏడాది క్రితం ఇదే త్రైమాసికం నాటికి రూ.3.11 లక్షల కోట్లుగా ఉన్నాయి.

**జియో లాభంలో 24 శాతం వృద్ధి**

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మరోసారి భారీ లాభాలను ఆర్జించింది. గత త్రైమాసికపు లాభంలో 24 శాతం వృద్ధిని సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.6,231 కోట్లుగా ఉన్న స్టాండలోన్ నికర లాభం గత త్రైమాసికానికిగాను 24.24 శాతం ఎగబాకి రూ.6,477 కోట్లకు చేరుకున్నది. కంపెనీ ఆదాయం రూ.25,368 కోట్ల నుంచి రూ.29,307 కోట్లకు ఎగబాకింది. డాటా వినిమయం




ఊపందుకోవడం, సరాసరిగా డాటాపై వచ్చే ఆదాయం పెరగడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 48.21 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. సరాసరి ఒక్కో కస్టమర్‌పై రూ.200 ఆదాయం సమకూరింది.

రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లు ఆర్జించింది.

గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం రిటైల్ స్టోర్ల సంఖ్య 19,102కి చేరుకున్నాయి.

గత త్రైమాసికంలో రికార్డు స్థాయి ఎబిటా మార్జిన్లు ఆర్జించినట్లు, నికర లాభంలో కన్సాలిడేటెడ్ స్థాయికి చేరుకున్నది. డిజిటల్ సర్వీసులు, టెలికం సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లావడం కలిసొచ్చింది.

# టైటాన్ బ్యాటరీతో రియల్‌మీ

# 14 సిరీస్ ఫోన్ల ఆవిష్కరణ.. ఇవీ స్పెషిఫికేషన్స్..!




ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన రియల్‌మీ 14 సిరీస్ ఫోన్లను ఆవిష్కరించింది. ఇందులో రియల్‌మీ 14 ప్రో 5జీ రియల్‌మీ 14 ప్రో ం 5జీ ఫోన్లు ఉన్నాయి. ఈ ఫోన్లు మూడు రంగుల ఆప్షన్లలో వస్తున్నాయి. గ్రే, కలర్ చేంజింగ్ పెరల్ వైట్ ఫినిష్ , బికనీర్ పర్పుల్ కలర్ ఆప్షన్లలో లభిస్తున్నాయి. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్ 3 చిప్‌సెట్, రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ 5జీ చిప్ సెట్ బ్యాటరీలతో వస్తున్నాయి. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ 50మెగా పిక్సెల్ ప్రైమరీ సోనీ ఐఎంఎక్స్896 సెన్సర్ కెమెరాతోపాటు ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్, రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ 80వాట్ల పాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తున్నది.

**రియల్‌మీ14ప్రో 5జీ సిరీస్ ఫోన్ల ధరలు ఇలా**

రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ 8జీబీ ర్యామ్ ం128జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.24,999, 8జీబీ ర్యామ్ ం256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.26,999 పలుకుతుంది. ఈ ఫోన్ జైపూర్ పింక్, పెరల్ వైట్, గ్రే రంగుల్లో లభిస్తుంది. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ 8జీబీ ర్యామ్ ం128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.29,999, 8జీబీ ర్యామ్ం256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.31,999, 12జీబీ ర్యామ్ ం256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.34,999 లకు లభిస్తుంది. ఈ ఫోన్ బికనీర్ పర్పుల్, పెరల్ వైట్, గ్రే రంగుల్లో లభిస్తుంది. అర్హత గల బ్యాంకు కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.4,000 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ నెల 23 నుంచి రియల్‌మీ 14 సిరీస్ ఫోన్ల ప్రీ బుకింగ్స్ ప్రారంభం అవుతాయి. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఆన్‌లైన్ స్టోర్, ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తాయి.

**రియల్‌మీ14ప్రోం 5జీ స్పెషిఫికేషన్స్**

రియల్‌మీ14 ప్రోం ఫోన్ ఆండ్రాయిడ్ 15 బేస్డ్ రియల్‌మీ యూఐ 6.0 వర్షన్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తోపాటు 6.83-అంగుళాల 1.5కే(1,272ఐ2,800 పిక్సెల్స్) అమోలెడ్ డిస్ ప్లే, 3840 హెర్ట్జ్ పీఎండబ్ల్యూ డిమ్మింగ్, 1500నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ డిస్‌ప్లే కార్నింగ్ గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్‌తో పని చేస్తుంది. స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్3 ప్రాసెసర్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 50- మెగా పిక్సెల్ 1/1.56-అంగుళాల సోనీ ఐఎంఎక్స్896 ప్రైమరీ సెన్సర్ కెమెరా విత్ ఆప్టికల్ ఇమేజ్ స్టేబిలైజేషన్, 8- మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్896 ఆల్ట్రావైడ్ షూటర్, 50-మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 సెన్సర్ పెరిస్కోప్ కెమెరా విత్ ఓఐఎస్ సపోర్ట్ విత్ అప్‌టూ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, 6ఎక్స్ లాస్‌లెస్ జూమ్ ఉంటుంది. సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది. రియల్‌మీ14 ప్రోం ఫోన్ 5జీ, 4జీ ఎల్టీఈ, వై-ఫై 6, బ్లూటూత్ 5.2, జీపీఎస్, గ్లోనాస్, బైదూ, గెలీలియో, క్యూజడ్ఎస్ఎస్, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. 80వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6,000 ఎంఏహెచ్ కెపాసిటీ గల టైటాన్ బ్యాటరీతో వస్తోంది ఫోన్.

**రియల్‌మీ14ప్రో 5జీ స్పెషిఫికేషన్స్**

రియల్‌మీ14ప్రో 5జీ ఫోన్ 6.77-అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 4,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ కోటింగ్ ప్రొటెక్షన్ ఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ 5జీ చిప్‌సెట్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 50- మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్ 882 రేర్ కెమెరా విత్ ఓఐఎస్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. ద్యుయల్ స్పీకర్స్ విత్ హై రెస్ సర్టిఫికేషన్ కలిగి ఉంటుంది. రియల్‌మీ14ప్రోం 5జీ ఫోన్‌లో మాదిరే కనెక్టివిటీ ఆప్షన్లు ఉంటాయి. సెక్యూరిటీ కోసం ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటుంది. 45వాట్ల చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. ఈ ఫోన్‌లు కోల్డ్ సెన్సిటివ్ కలర్ చేంజింగ్ టెక్నాలజీతో రూపుదిద్దుకున్నాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులకు అనుగుణంగా పెరల్ వైట్ వేరియంట్ ఫోన్ రంగులు మారుతూ ఉంటుంది. 16 డిగ్రీల సెల్సియస్ వద్ద ఫోన్ కలర్ తిరిగి వస్తుంది.

# పన్నుల భారం తగ్గించాలి

### ఇక్రా బడ్జెట్ విన్నపం




వచ్చే కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) భారం తగ్గించక తప్పదని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా స్పష్టం చేసింది. ఈ భారం తగ్గితే తప్ప వినియోగ వ్యయం పెరిగి జీడీపీ వృద్ధిరేటు పుంజుకునే అవకాశం లేదని పేర్కొంది. గత సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు రెండేళ్ల కనిష్ట స్థాయి 5.4 శాతానికి పడిపోయిన నేపథ్యంలో ఇక్రా ఈ హెచ్చరిక చేసింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు కూడా రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండాలని సూచించింది.

**రూ.1.4 లక్షల కోట్ల లోటు :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.11.11 లక్షల కోట్ల మూలధన పెట్టుబడుల్లో రూ.1.4 లక్షల కోట్లు లోటు ఏర్పడే అవకాశం ఉందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అది తి నాయర్ చెప్పారు. గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మొత్తం మూలధన పెట్టుబడుల్లో 46 శాతం (రూ.5.13 లక్షల కోట్లు) మాత్రమే ఖర్చు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రుణ సేకరణను నియంత్రిస్తూ మూలధన పెట్టుబడులు రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు తీసుకోవాలన్నారు. 4.5 శాతం ద్రవ్య లోటు సాధ్యమే : ఆదాయ వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయడం పెద్ద కష్టమేమీ కాదని నాయర్ స్పష్టం చేశారు. అపుడు మూలధన పెట్టుబడుల కోసం రూ.11 లక్షల కోట్లు కేటాయించడం సాధ్యమవుతుందన్నారు.

**దిగుమతులు కట్టడి చేయాలి : ఈవై**

పడిపోతున్న రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సూచించింది. ఇందుకోసం దిగుమతులపై సుంకాలు పెంచాలని కోరింది. ఇలా చేయడం వల్ల డాలర్లకు గిరాకీ తగ్గి, రూపాయి మారకం రేటు కుదు టపడుతుందని తెలిపింది.

**పన్నుపోటు తగ్గించండి: క్రెడాయ్**

అందుబాటు ధరల (అఫర్డబుల్) గృహ ప్రాజెక్టులపై ఆదాయ పన్ను 15 శాతానికి కుదించాలని రియల్ ఎస్టేట్ రంగం కోరింది. అలాగే ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరింది. అలాగే అందుబాటు ధరల గృహ నిర్వచనాన్నీ ప్రస్తుతం రూ.45 లక్షల నుంచి మరింత పెంచాలని విజ్ఞప్తి చేసింది.

**టూ వీలర్లపై జీఎసటీ తగ్గించాలి : హీరో మోటోకార్ప్**

కనీసం 125 సీసీ వరకు సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్ టీని 28నుంచి 18 స్థాయికి కుదించాలని హీరో మోటోకార్ప్ కోరింది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332